మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 23-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 113 Issue: 113

23 అక్టోబర్ 2025 - గురువారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:15 సూర్యాస్తమయం - సా. 5:45 తిథిః విదియ రా. 10:47 వరకు తరువాత తదియ సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం విశాఖ తె. 4:44o వరకు తరువాత అనురాధ యోగం ఆయుష్మాన్ తె. 4:58o వరకు కరణం భాలవ ఉ. 9:31 వరకు కౌలవ రా. 10:47 వరకు వర్జ్యం ఉ. 8:09 నుండి ఉ. 9:57 వరకు దుర్ముహూర్తం ఉ. 10:05 నుండి ఉ. 10:51 వరకు మ. 2:41 నుండి మ. 3:27 వరకు రాహుకాలం మ. 1:26 నుండి మ. 2:53 వరకు యమగండం ఉ. 6:15 నుండి ఉ. 7:41 వరకు గుళికాకాలం ఉ. 9:07 నుండి ఉ. 10:34 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:39 నుండి తె. 5:27 వరకు అమృత ఘడియలు సా. 6:56 నుండి రా. 8:44 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:37 నుండి మ. 12:23 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com


## పసిడి ధమాల్!

### ఒక్కసారిగా పడిపోయిన బంగారం ధర

**ఒక్క రోజులోనే రూ.4,690 తగ్గిన తులం రేటు**



ఆకాశమే హద్దుగా పెరిగిన బంగారం ధరలు ఒక్కసారిగా నేలచూపులు చూసింది. ఏకంగా 12 ఏళ్ల రికార్డును బద్దలు కొడుతూ భారీగా పతనమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో మంగళవారం ఒక్కరోజే స్పాట్ గోల్డ్ ధర 6.3 శాతం కుప్పకూలింది. 2013 తర్వాత ఒకే రోజులో పసిడి ధర ఈ స్థాయిలో పతనం కావడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఈ ప్రభావంతో దేశీయ మార్కెట్లలోనూ బంగారం ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి.

హైదరాబాద్, అక్టోబర్ 22 (ఈవార్తలు): హైదరాబాద్ మార్కెట్‌లో బుధవారం 24 క్యారెట్ల బంగారం ధర ఒక్కరోజే తులం (10 గ్రాములు)పై రూ.4,690 తగ్గింది. దీంతో ప్రస్తుతం తులం ధర రూ.1,12,589కి చేరింది. దేశీయ మార్కెట్‌లో ఒకే రోజులో ఈ స్థాయిలో ధర తగ్గడం ఇటీవలి కాలంలో ఇదే తొలిసారి. బంగారం ధరలు ఈ స్థాయిలో పడిపోవడానికి పలు అంతర్జాతీయ పరిణామాలు కారణమయ్యాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. గత -2 వ పేజీలో...

## రూపాయి భద్రం!

**రంగంలోకి ఆర్బీఐ.. డాలర్ల అమ్మకం.. బంగారం కొనుగోలు**

రూపాయికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అండగా నిలిచింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత పడిపోకుండా నిరోధించేందుకు భారీ ఎత్తున చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆగస్టు నెలలో ఏకంగా 7.7 బిలియన్ అమెరికన్ డాలర్లను (సుమారు రూ. 67 వేల కోట్లు) మార్కెట్లో విక్రయించినట్లు ఆర్బీఐ తన తాజా బులెటిన్‌లో వెల్లడించింది.

ముంబై: ఇటీవల డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 88కి పడిపోయిన సంగతి తెలిసిందే. ఆగస్టు నెలలో రూపాయి విలువ 1.6 శాతం వరకు క్షీణించడంతో కేంద్ర బ్యాంక్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. మార్కెట్లో డాలర్లకు డిమాండ్ -2 వ పేజీలో...



## ఇద్దరు పిల్లల నిబంధన రద్దు

**ఫైల్‌పై సీఎం రేవంత్ సంతకం**

**నేడు కేబినెట్ ముందుకు దస్త్రం**

**ఆర్డినెన్స్ జారీ చేసేందుకు కసరత్తు**

**గవర్నర్ ఆమోదంతో అమల్లోకి..!**



తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారికి ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్నవారు అనర్హులు అనే 30 ఏళ్ల నాటి నిబంధనను తొలగించేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు గురువారం జరగనున్న కేబినెట్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుని, ఆర్డినెన్స్ జారీ చేయాలని భావిస్తోంది.

హైదరాబాద్, అక్టోబర్ 22 (ఈవార్తలు): ఈ ప్రక్రియ పూర్తయితే, రానున్న పంచాయతీ ఎన్నికల నుంచే ఈ కొత్త విధానం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాలు ప్రస్తుతం జరగడం లేదు. ఈ నేపథ్యంలో చట్టసవరణను ఆర్డినెన్స్ రూపంలో తీసుకురావాలని-2 వ పేజీలో...

## ఇందిరమ్మ ఇల్లు జీ+1

**చిన్న ప్లాట్లలో నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం.. సడలింపులు ఇస్తూ సర్కారు జీవో జారీ**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ అందించింది. చిన్న ప్లాట్లలో ఇందిరమ్మ ఇళ్లను జీ+1 పద్ధతిలోనూ నిర్మాణం చేసుకునేందుకు అనుమతించింది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో స్థలం ఉన్న వారికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేస్తోంది. ఇల్లు కనీసం 400 చదరపు అడుగులు, గరిష్ఠంగా 600 చదరపు అడుగులు ఉండాలని షరతు విధించింది.



హైదరాబాద్, అక్టోబర్ 22 (ఈవార్తలు): గ్రౌండ్‌ఫ్లోర్‌లో 400 చదరపు అడుగుల నిర్మాణం చేపట్టలేని ప్లాట్లలో జీ ప్లస్ వన్ పద్ధతిలో కట్టుకునేందుకు సర్కారు సడలింపు ఇస్తూ పూర్తి వివరాలతో మార్గదర్శకాలు (జీవో 69) విడుదల చేసింది. ఈ మేరకు జీ+1 ఇళ్లకు కనీస కార్పెట్ ఏరియా -2 వ పేజీలో...



## సునీత.. గోపీనాథ్ భార్య కాదు!

### నేనే చట్టబద్ధమైన కుమారుడిని

**తారక్ ప్రద్యుమ్న సంచలన ఆరోపణలు.. సునీత తప్పుడు సమాచారమిచ్చారని ఈసీకి లేఖ**

మాగంటి సునీత మాగంటి గోపీనాథ్ భార్య కాదంటూ సంచలన ఆరోపణలు చేశాడో వ్యక్తి. మాగంటి గోపీనాథ్ కుమారుడిగా చెప్పుకుంటున్న తారక్ ప్రద్యుమ్న ఎన్నికల సంఘానికి లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది. సునీత తప్పుడు సమాచారం ఇచ్చారని.. చాలా విషయాలను దాచిపెట్టారని ఆయన లేఖలో ఆరోపించారు. 'గోపీనాథ్ 1998 ఏప్రిల్ 29న కోసరాజు మాలిని దేవిని చట్టబద్ధంగా వివాహం చేసుకున్నారు. ఈ వివాహం ఆయన మరణం వరకు కొనసాగింది. డివోర్స్ జరగలేదు. నేను వారి ఏకైక చట్టబద్ధ కుమారుడిని.

హైదరాబాద్, అక్టోబర్ 22 (ఈవార్తలు): సునీత మాగంటి గోపీనాథ్‌తో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండేవారు. ఆమెను ఆయన చట్టబద్ధ భార్యగా.. తన పిల్లలను చట్టబద్ధ వారసులుగా తప్పుగా చూపారని ఆరోపణ. ఎన్నికల అఫిడవిట్‌లో కూడా ఇలా తప్పుడు సమాచారం ఇచ్చారు. ఇది ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951 సెక్షన్ 125ఏను ఉల్లంఘించినట్టు అవుతుంది' అంటూ తరువాయి 2 వ పేజీలో...

## చెక్ పోస్టులు రద్దు

**తక్షణమే మూసివేయాలని సీఎం ఆదేశాలు**

**అమలు చేస్తూ రవాణాశాఖ ఉత్తర్వులు జారీ**

**సిబ్బంది జిల్లా కార్యాలయాలకు..**

**బోర్డులు, బారికేడ్లు తొలగించాలని ఆదేశం**




హైదరాబాద్, అక్టోబర్ 22 (ఈవార్తలు): రాష్ట్రంలోని వాహనదారులకు ఊరట కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రవాణా శాఖ చెక్‌పోస్టులను తక్షణమే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సీఎం ఆదేశాల మేరకు రవాణా శాఖ ఈ నిర్ణయాన్ని వెంటనే అమలు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. రవాణా శాఖ కమిషనర్ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం, ఈరోజు సాయంత్రం 5 గంటలలోగా రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టుల కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేయాలని జిల్లా రవాణా అధికారులు (డీటీవో), డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లను (డీటీసీ) ఆదేశించారు. ఆగస్టు 28, 2025న విడుదలైన ప్రభుత్వ -2 వ పేజీలో...



## రెండేళ్లలో కొత్త ఉస్మానియా

**ఆస్పత్రి భవన నిర్మాణ పనుల పురోగతిపై సీఎం సమీక్ష.. నిర్మాణ పనులు వేగవంతానికి సమన్వయ కమిటీ**

ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రి కొత్త భవనాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భవన నిర్మాణ పనుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,589 |
| వెండి (గ్రాము): | రూ.175 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,322 |

### విశ్వవాణి




ఇంగ్లిష్‌లోనే అత్యంత క్లిష్టమైన పదం ఏదీ అంటే.. 'రన్'. ఈ పదానికి ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలో ఏకంగా 645 రకాల వేర్వేరు అర్థాలున్నాయి.



## సౌదీ కఫాలా రద్దు

### లక్షల మంది విదేశీ కార్మికులకు స్వేచ్ఛ

**25 లక్షల మంది భారతీయులకు ఊరట.. 'విజన్ 2030'లో యువరాజు సంస్కరణ**

**పాస్‌పోర్టులు లాక్కోవడంపై ఉక్కుపాదం.. ఉద్యోగం మారేందుకు, దేశం విడిచి వెళ్లేందుకు స్వేచ్ఛ**

సౌదీ అరేబియాలో దశాబ్దాలుగా విదేశీ కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కఫాలా కార్మిక స్పాన్సర్‌షిప్ విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఐదు దశాబ్దాల క్రితం అమల్లోకి వచ్చిన ఈ అమానవీయ వ్యవస్థకు ముగింపు పలుకుతూ తీసుకున్న ఈ నిర్ణయంతో కోటి ముప్పై లక్షల మంది విదేశీ కార్మికులకు విముక్తి లభించనుంది.

రియాద్: వీరిలో సుమారు 25 లక్షల మంది భారతీయులు ఉండటం గమనార్హం. ఈ మేరకు బుధవారం నివేదికలు ధ్రువీకరించాయి. 1950వ దశకంలో సౌదీ అరేబియా ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి భారత్, ఇతర ఆగ్నేయాసియా దేశాల నుంచి కార్మికులను రప్పించేందుకు కఫాలా విధానాన్ని -2 వ పేజీలో...

## శారీరక సంబంధం.. రేప్ కాదు

**పోక్సో కేసులో నిందితుడికి ఊరట.. నిర్దోషిగా ప్రకటించిన ఢిల్లీ హైకోర్టు**




పోక్సో చట్టం కింద నమోదైన ఒక కీలక కేసులో ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బాధితురాలు తన వాంగ్మూలంలో ఉపయోగించిన 'శారీరక సంబంధం' అనే పదం చాలా అస్పష్టంగా ఉందని, కేవలం ఆ పదాన్ని ఆధారంగా చేసుకుని అత్యాచారం లేదా లైంగిక దాడి జరిగిందని నిర్ధారించలేమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, ట్రయల్ కోర్టు విధించిన పదేళ్ల కఠిన కారాగార శిక్షను రద్దు చేస్తూ నిందితుడిని నిర్దోషిగా ప్రకటించింది.

న్యూఢిల్లీ: రాహుల్ అలియాస్ భూపిందర్ వర్మ అనే వ్యక్తి తన 16 ఏళ్ల కజిన్‌ను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకున్నాడని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసును విచారించిన ట్రయల్ కోర్టు అతడిని దోషిగా తేల్చి పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ నిందితుడు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. ఈ అప్పీలుపై విచారణ జరిపిన జస్టిస్ మనోజ్ కుమార్ ఓహ్రి నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం, ప్రాసిక్యూషన్ నేరాన్ని నిస్సందేహంగా నిరూపించడంలో తరువాయి 2 వ పేజీలో...



## బాలికపై అత్యాచారం.. 32 ఏళ్ల జైలు

**నల్లగొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు**

నల్లగొండ, అక్టోబర్ 22 (ఈవార్తలు): నల్లగొండ పోక్సో న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. మైనర్‌పై అత్యాచారం కేసులో నిందితుడు గురజాల చందుకు 32 ఏళ్ల జైలు శిక్షను విధిస్తూ పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. మైనర్ బాలికను కిడ్నాప్ చేసి నిందితుడు పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. 2022లో నల్లగొండ రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. అప్పటి నుంచి స్థానిక పోక్సో కోర్టులో వాదనలు జరిగాయి. నేడు కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి రోజారమణి తీర్పు తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు
23.10.2025

మేషం: కొన్ని వ్యవహారాలలో సొంత నిర్ణయాలు అంతగా కలిసి రావు. చేపట్టిన పనులు ముందుకు సాగవు. వ్యాపారాలు సాదాసీదాగా సాగుతాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు వలన తగిన విశ్రాంతి ఉండదు. కుటుంబ సభ్యులతో స్వల్ప విభేదాలు ఉంటాయి. ఆర్థిక ఇబ్బందులు వలన నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు.

వృషభం: వ్యాపారాలలో ఆశించిన పురోభివృద్ధి కలుగుతుంది. చేపట్టిన పనులలోశ్రమ ఫలిస్తుంది. నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి బయట పడగలుగుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. కొన్ని వ్యవహారాలలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

మిధునం: స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. దూరపు బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. విందువినోదాది కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

కర్కాటకం: వ్యాపారపరంగా తీసుకున్నటువంటి నిర్ణయాలు నష్టాలను మిగులుస్తాయి. దూర ప్రయాణాలు వాయిదా వేస్తారు. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఉద్యోగాలలో అధికారుల నుండి సమస్యలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాల్లో తొందరపాటు నిర్ణయాలు పనిచేయవు. కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి.

సింహం: చేపట్టిన పనుల్లో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. పనులలో వ్యయప్రయాసలు అధికమౌతాయి. బంధువుల నుంచి ఋణ ఒత్తిడులు అధికమౌతాయి. నిరుద్యోగులకు నిరుత్సాహం తప్పదు. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపార ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి.

కన్య: కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. వివాదాలకు సంబంధించి కీలక సమాచారం సేకరిస్తారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వ్యాపార, ఉద్యోగాలు ఉత్సాహవంతంగా సాగుతాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

తుల: వృత్తి వ్యాపారాలు కొంత నిరాశ పరుస్తాయి. బంధుమిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ఉద్యోగాలలో అదనపు పని భారం వలన తగిన విశ్రాంతి ఉండదు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన పనుల్లో ప్రతిబంధకాలు ఉ ంటాయి.

వృశ్చికం: స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. చిన్ననాటి మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. వ్యాపారాలు మరింత అనుకూలిస్తాయి. ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది. విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు.

ధనస్సు: చేపట్టిన పనులు నత్తనడకన సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు వ్యయప్రయాసలతో కాని పూర్తి కావు. వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. వృత్తి ఉద్యోగాలలో కొన్ని ఇబ్బందులు తప్పవు. బంధుమిత్రుల నుంచి ఒత్తిడులు అధికమవుతాయి. ఆధ్యాత్మిక చింతన అవుతుంది.

మకరం: వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. ఆప్తుల నుంచి కీలక సమాచారం అందుతుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో ఉన్నటువంటి సమస్యలు పరిష్కారమవుతాయి. సంతానానికి నూతన విద్యావకాశాలు లభిస్తాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

కుంభం: ఉద్యోగాలలో ఆశించిన పదవులు పొందగలుగుతారు. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయి. వ్యాపారాలలో చికాకులు తొలగుతాయి. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. ఆప్తుల నుంచి శుభవార్తలు వింటారు. నూతన వాహనయోగం ఉన్నది.

మీనం: వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగాలలో ఇతరుల నుండి ఊహించని సమస్యలు ఎదురవుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు అంతగా కలిసి రావు. వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

# పసిడి ధమాల్!

మొదటి పేజీ తరువాయి

కొంతకాలంగా రికార్డు స్థాయిలో పెరిగిన బంగారం ధరలతో ఇన్వెస్టర్లు భారీగా లాభాల స్వీకరణకు (ప్రాఫిట్ బుకింగ్) మొగ్గు చూపారు. పెద్ద ఎత్తున బంగారాన్ని అమ్మేయడంతో ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. అమెరికా డాలర్ విలువ బలపడటం కూడా పసిడిపై ప్రభావం చూపింది. డాలర్ బలపడినప్పుడు, ఇతర కరెన్సీలలో బంగారం కొనడం ఖరీదుగా మారుతుంది. దీంతో సహజంగానే డిమాండ్ తగ్గుతుంది. అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. త్వరలోనే ఇరు దేశాల అధ్యక్షులు సమావేశమై వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో, అంతర్జాతీయంగా ఆందోళనలు తగ్గాయి. ఇలాంటి పరిస్థితుల్లో సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారంపై ఇన్వెస్టర్ల ఆసక్తి తగ్గుతుంది. రాజకీయ ఆందోళనలు తగ్గడంతో పెట్టుబడిదారులు బంగారం వంటి సురక్షిత సాధనాల నుంచి వైదొలగి, అధిక రాబడినిచ్చే స్టాక్ మార్కెట్ల వైపు దృష్టి సారిస్తున్నారు. అయితే, ప్రస్తుతం కనిపిస్తున్న ఈ పతనం తాత్కాలికమేనని, దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణం, వివిధ దేశాల కేంద్ర బ్యాంకుల కొనుగోళ్ల కారణంగా బంగారం ధరలు మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# రూపాయి భద్రం!

మొదటి పేజీ తరువాయి

పెరిగినప్పుడు రూపాయి బలహీనపడుతుంది. అటువంటి సమయంలో ఆర్బీఐ తన విదేశీ మారక నిల్వల నుంచి డాలర్లను అమ్ముతుంది. దీనివల్ల మార్కెట్లో డాలర్ల సరఫరా పెరిగి, రూపాయి విలువ స్థిరపడుతుంది. జూలై నెలతో పోలిస్తే ఆగస్టులో ఆర్బీఐ విక్రయించిన డాలర్లు ఏకంగా మూడు రెట్లు అధికం కావడం గమనార్హం. మార్కెట్లో తీవ్రమైన అనిశ్చితి ఉన్నప్పుడు మాత్రమే తాము జోక్యం చేసుకుంటామని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఒకవైపు డాలర్లను విక్రయిస్తూనే మరోవైపు ఆర్బీఐ వ్యూహాత్మకంగా బంగారం నిల్వలను పెంచుకుంటోంది. రెండు నెలల విరామం తర్వాత సెప్టెంబర్‌లో కొత్తగా 200 కిలోల పసిడిని కొనుగోలు చేసింది. దీంతో ఆర్బీఐ వద్ద ఉన్న మొత్తం బంగారం నిల్వలు 880.18 టన్నులకు చేరాయి. దీని విలువ సుమారు రూ. 8.36 లక్షల కోట్లుగా ఉంది. ఏ దేశ కేంద్ర బ్యాంకు వద్దనైనా బంగారం నిల్వలు ఎక్కువగా ఉంటే, ఆ దేశ ఆర్థిక వ్యవస్థ, కరెన్సీపై అంతర్జాతీయంగా నమ్మకం పెరుగుతుంది. సంక్షోభ సమయాల్లో బంగారం సురక్షితమైన ఆస్తిగా పనిచేస్తుంది. విదేశీ మారక నిల్వల్లో డాలర్ల వంటి కరెన్సీలు ఉన్నప్పటికీ, బంగారం నిల్వలు ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని ఇస్తాయి. అధిక బంగారం నిల్వలు దేశ రేటింగ్ మెరుగుపడటానికి కూడా దోహదపడతాయి. తద్వారా తక్కువ వడ్డీకే అంతర్జాతీయ రుణాలు పొందే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆర్బీఐ చేపడుతున్న ఈ ద్వంద్వ వ్యూహం రూపాయిని బలోపేతం చేయడానికేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

# సునీత.. గోపీనాథ్ భార్య కాదు!

మొదటి పేజీ తరువాయి

లేఖలో పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు మద్దతుగా రాజేంద్రనగర్ డివిజన్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో) 2025 అక్టోబర్ 11న జారీ చేసిన ఆర్డర్‌ను (రిఫరెన్స్ నెం.సి/2100/2025) ఆయన జతచేశారు. ఈ ఆర్డర్‌లో సునీత తప్పుడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పొందారని.. గోపీనాథ్ మొదటి వివాహ విషయాలను దాచిపెట్టారని అన్నారు. దీంతో ఆ సర్టిఫికెట్‌ను (నెం. సి/08/2025-262, తేదీ 04.07.2025) రద్దు చేశారని.. సునీత గోపీనాథ్ చట్టబద్ధ భార్య కాదని ఆర్డీవో ధ్రువీకరించారని తెలిపారు. ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న తారక్ ప్రధుమ్న.. ఎన్నికల కమిషన్‌కు ఈ లేఖలో అఫిడవిట్ ధ్రువీకరణ చేయాలని కోరారు. తప్పుడు సమాచారానికి చర్యలు తీసుకోవాలని, అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలన్నారు. అవసరమైతే తాను హైదరాబాద్‌కు వచ్చి సహకరిస్తానని చెప్పారు. ఆర్డీఓ ఆర్డర్, తప్పుడు ఫ్యామిలీ సర్టిఫికెట్, తల్లిదండ్రుల వివాహ ఫోటోలు (1998), తన బర్త్ సర్టిఫికెట్ లేఖకు జత చేశారు. అయితే ఈ ఆరోపణలపై మాగంటి సునీత వైపు నుంచి ఇంకా స్పందన రాలేదు. ఎన్నికల కమిషన్ ఈ విషయంపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

# ఇద్దరు పిల్లల నిబంధన రద్దు

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీరాజ్, పురపాలక శాఖలు ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేశాయి. మంత్రి సీతక్క ఈ ఫైల్‌పై సంతకం చేయగా, సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తర్వాత దీనిని కేబినెట్ ముందుకు తీసుకురానున్నారు. మంత్రివర్గం ఆమోదించిన వెంటనే, ముసాయిదా ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదానికి పంపిస్తారు. గవర్నర్ ఆమోద ముద్ర వేస్తే, పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్నవారు కూడా పోటీ చేసేందుకు మార్గం సుగమం అవుతుంది. కుటుంబ నియంత్రణను ప్రోత్సహించే లక్ష్యంతో ఉమ్మడి ఏపీలో 1995లో ఈ నిబంధనను ప్రవేశపెట్టారు. దాదాపు మూడు దశాబ్దాలుగా ఇది అమల్లో ఉ ంది. అయితే, రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు, కుటుంబ నియంత్రణపై ప్రజల్లో పెరిగిన అవగాహన, ప్రజల నుంచి వస్తున్న వినతులను పరిగణనలోకి తీసుకుని ఈ నిబంధనను ఎత్తివేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గత సంవత్సరం ఏపీలో కూడా ఇదే తరహా చట్టసవరణ చేశారు. ఈనెల 16న జరిగిన మంత్రివర్గ సమావేశంలో సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం, ఇప్పుడు దానిని ఆచరణలో పెట్టేందుకు కసరత్తు పూర్తి చేసింది.



# రెండేళ్లలో కొత్త ఉస్మానియా

**ఆస్పత్రి భవన నిర్మాణ పనుల పురోగతిపై సీఎం సమీక్ష.. నిర్మాణ పనులు వేగవంతానికి సమన్వయ కమిటీ**

హైదరాబాద్, అక్టోబర్ 22 (ఈవార్తలు): ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రి కొత్త భవనాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భవన నిర్మాణ పనుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు ఆధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లుగా గదుల నిర్మాణం, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలని అన్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో పదిరోజులకు ఒకసారి పర్యటించాలని సూచించారు.

# ఇందిరమ్మ ఇల్లు జీ+1

మొదటి పేజీ తరువాయి

323 చదరపు అడుగులు ఉండాలని స్పష్టం చేసింది. కిచెన్, బాత్‌రూం, టాయిలెట్ కచ్చితంగా ఉండాలని జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో రూఫ్ నిర్మించాక రూ.లక్ష, మొదటి అంతస్తు రూఫ్ లెవెల్ వరకు కాలమ్స్ నిర్మించాక మరో రూ.లక్ష, గోడలు నిర్మించిన అనంతరం రూ.2 లక్షలు, నిర్మాణం పూర్తయ్యాక రూ.లక్ష నగదును విడుదల చేస్తారు.

**కొత్త నిబంధనలు ఇవే..**

- గ్రౌండ్ ఫ్లోర్‌లో 200 అడుగులు ఉండాలి
- ఫస్ట్ ఫ్లోర్‌లో 200 అడుగులు ఉండాలి
- ఒక్కో ఫ్లోర్‌లో రెండు గదులు 70 చదరపు అడుగుల చొప్పున ఉండాలి
- కిచెన్ 35.5 చదరపు అడుగులు
- టాయిలెట్, బాత్రూం కచ్చితంగా ఉండాలి
- రూ. 5 లక్షలను నాలుగు దశల్లో అందజేస్తారు.

# సౌదీ కఫాలా రద్దు

మొదటి పేజీ తరువాయి

ప్రవేశపెట్టారు. ఈ విధానం ప్రకారం, ప్రతి విదేశీ కార్మికుడికి ఒక 'కఫీల్' లేదా 'స్పాన్సర్' ఉంటారు. వీరు ఒక వ్యక్తి కావచ్చు లేదా ఒక కంపెనీ కావచ్చు. కార్మికుడి పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవడం, వారి జీతాలను నిలిపివేయడం, వారు ఎప్పుడు ఉద్యోగం మారాలి, ఎప్పుడు దేశం విడిచి వెళ్లాలో నిర్ణయించడం వంటి అమానవీయ అధికారాలు ఈ స్పాన్సర్లకు ఉండేవి. కనీసం తమపై జరుగుతున్న వేధింపుల గురించి ఫిర్యాదు చేయాలన్నా స్పాన్సర్ అనుమతి తీసుకోవాల్సిన దయనీయ పరిస్థితి ఉండేది. ఈ విధానం కార్మికుల హక్కులను కాలరాయడమే కాకుండా, వారిని వెట్టిచాకిరీలోకి నెడుతోందని కార్మిక, మానవ హక్కుల సంఘాలు ఏళ్లుగా తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'విజన్ 2030' ప్రణాళికలో భాగంగానే ఈ కీలక సంస్కరణకు శ్రీకారం చుట్టారు. దేశ ప్రతిష్ఠను పెంచడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, ఆర్థిక వ్యవస్థను వైవిధ్యభరితం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా 2029లో జరగనున్న ఆసియా వింటర్ గేమ్స్ వంటి అంతర్జాతీయ కార్యక్రమాలకు ముందు దేశంలో కార్మిక సంస్కరణలు తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గతంలో అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) సైతం కఫాలా వంటి స్పాన్సర్‌షిప్ విధానాలు కార్మికుల హక్కులను హరిస్తాయని, బలవంతపు వెట్టిచాకిరీకి దారితీస్తాయని పేర్కొంది.




# చెక్ పోస్టులు రద్దు

మొదటి పేజీ తరువాయి

ఉత్తర్వుల ప్రకారం ఈ చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఆదేశాల ప్రకారం, రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూసేందుకు చెక్‌పోస్టుల వద్ద ఉన్న బోర్డులు, బారికేడ్లు, ఇతర సూచికలను పూర్తిగా తొలగించాలని సూచించారు. ఈ తొలగింపు ప్రక్రియను తప్పనిసరిగా వీడియో తీసి, నివేదికతో పాటు ఉ న్నతాధికారులకు పంపాలని స్పష్టం చేశారు. చెక్‌పోస్టుల మూసివేత ప్రక్రియ సాయంత్రం 5 గంటల లోపు పూర్తి కావాలని గడువు విధించారు. ప్రస్తుతం చెక్‌పోస్టులలో పనిచేస్తున్న సిబ్బందిని వారి సంబంధిత జిల్లా రవాణా కార్యాలయాలకు పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా, చెక్‌పోస్టులలో ఉన్న ఫర్నిచర్, రికార్డులు, పరికరాలు, ఇతర వస్తువులను వెంటనే డీటీవో కార్యాలయాలకు తరలించాలని తెలిపారు. క్యాష్ బుక్కులు, రసీదులు, చలాన్లతో సహా అన్ని ఆర్థిక, పరిపాలనా రికార్డులను సరిచూసి భద్రపరచాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల మూసివేత సమాచారాన్ని వాహనదారులకు తెలియజేసేందుకు సంబంధిత ప్రాంతాల్లో పబ్లిక్ నోటీసులు ప్రదర్శించాలని కమిషనర్ సూచించారు. సిబ్బంది పునర్‌నియామకం, రికార్డుల తరలింపు, చెక్‌పోస్టుల పూర్తి మూసివేతపై సమగ్ర నివేదికను బుధవారం సాయంత్రం 5 గంటల లోపే తమ కార్యాలయానికి సమర్పించాలని కమిషనర్ స్పష్టం చేశారు. దీంతో నివేదిక కమిషనర్ కార్యాలయానికి చేరింది.




## శారీరక సంబంధం..
# రేప్ కాదు

మొదటి పేజీ తరువాయి

విఫలమైందని అభిప్రాయపడింది. "కేవలం 'శారీరక సంబంధం' అనే పదాన్ని ఉపయోగించడం వల్ల, దానికి సరైన ఆధారాలు లేనప్పుడు, నేరం జరిగినట్లుగా భావించలేం" అని కోర్టు పేర్కొంది. భారత శిక్షాస్మృతి (ఐపీసీ)లో గానీ, పోక్సో చట్టంలో గానీ ఈ పదానికి నిర్దిష్ట నిర్వచనం లేదని గుర్తుచేసింది. బాధితురాలు 'శారీరక సంబంధం' అని చెప్పినప్పుడు, దాని అర్థం ఏమిటో, అది లైంగిక దాడి కిందకు వస్తుందో లేదో ప్రాసిక్యూషన్ గానీ, ట్రయల్ కోర్టు గానీ స్పష్టత కోరలేదని హైకోర్టు తప్పుబట్టింది. సాక్షుల నుంచి సరైన వాస్తవాలను రాబట్టాల్సిన బాధ్యత కోర్టుపై ఉందని ఎవిడెన్స్ యాక్ట్‌లోని సెక్షన్ 165ను ఉటంకించింది. ఈ కేసులో ఘటన జరిగిన దాదాపు ఏడాదిన్నర తర్వాత మార్చి 2016లో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపైనా హైకోర్టు సందేహాలు వ్యక్తం చేసింది. నిందితుడు పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు విషం తాగిందని, ఆ తర్వాత ఆమెకు మాట పడిపోయిందని, తిరిగి మాట వచ్చిన తర్వాత ఫిర్యాదు చేశారని ప్రాసిక్యూషన్ వాదించింది. అయితే, ఈ వాదనను బలపరిచే ఎలాంటి వైద్యపరమైన ఆధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. ఇంత సుదీర్ఘ జాప్యానికి సరైన కారణాలు చూపడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని పేర్కొంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఇది ఒక "దురదృష్టకరమైన కేసు" అని వ్యాఖ్యానిస్తూ, ట్రయల్ కోర్టు తీర్పును కొట్టివేసింది. నిందితుడిని వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

## బాలికపై అత్యాచారం..
# 32 ఏళ్ల జైలు

మొదటి పేజీ తరువాయి

వెలువరించారు. 32 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 75 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం అందించాలని తీర్పులో పేర్కొన్నారు.



# అర్జున అవార్డులకు కొత్త మార్గదర్శకాలు

న్యూఢిల్లీ: భారత క్రీడా రంగంలో అత్యున్నత గౌరవాల్లో ఒకటైన అర్జున అవార్డులు విధానంలో కేంద్ర ప్రభుత్వం తాజా మార్పులు చేసింది. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 2025కి సవరించిన కొత్త మార్గదర్శకాలను ప్రకటించింది. వీటి ఆధారంగా అర్హులైన క్రీడాకారులు అర్జున అవార్డు కోసం దరకాస్తు చేసుకునే అవకాశం కేంద్రం కల్పించింది. అర్జున అవార్డు లక్ష్యం కేవలం విజయాలను గుర్తించడం కోసం మాత్రమే కాదు, క్రీడాభివృద్ధికి కృషి చేసిన వారిని ప్రోత్సహించడం కోసం కూడా రూపొందించబడింది. ఇందులో భాగంగా రెండు విభాగాల అర్జున అవార్డులను కేంద్రం అర్హులైన క్రీడాకారులకు ఇచ్చేందుకు సిద్ధమైంది. వాటిలో ఈ రెండు విభాగాలు ఉన్నాయి.

1 అర్జున అవార్డు: గత నాలుగు సంవత్సరాల్లో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు.

2 అర్జున అవార్డు (లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్): క్రీడా జీవితానికి అనంతరం కూడా క్రీడల అభివృద్ధిలో సేవలందిస్తున్న మాజీ క్రీడాకారులకు.

అర్హత ప్రమాణాలు: క్రీడాకారులు ఒలింపిక్స్, ఆసియా గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్, వరల్డ్ కప్ వంటి అంతర్జాతీయ ఈవెంట్లలో విజయాలు సాధించి ఉండాలి. డోపింగ్ లేదా నైతిక ఉల్లంఘనలు జరగకూడదు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలి.ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న క్రీడాకారులు తగిన సర్టిఫికేట్ సమర్పించాలి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో సెలెక్షన్ కమిటీని ఏర్పాటు చేస్తుంది. ఈ కమిటీలో మాజీ ఒలింపియన్లు, అర్జున అవార్డు గ్రహీతలు, క్రీడా జర్నలిస్టులు, నిపుణులు ఉంటారు. కమిటీ క్రీడాకారుల ప్రదర్శన, నాయకత్వం, క్రీడాస్ఫూర్తి వంటి అంశాల ఆధారంగా మార్కులు కేటాయించి తుది జాబితా సిద్ధం చేస్తుంది. ప్రతి విజేతకు ప్రభుత్వం నుండి రూ. 15 లక్షల నగదు బహుమతి,సర్టిఫికేట్,అర్జున అవార్డును అందిస్తారు, అవార్డులు ప్రతి సంవత్సరం ఆగస్టు 29న హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినం సందర్భంగా అర్హులైన అభ్యర్థులకు రాష్ట్రపతి ఈ అవార్డులను ప్రదానం చేస్తారు.



## రేవంత్ పాలన ఆగమాగం: హరీష్ రావు

సిద్దిపేట, అక్టోబర్ 22: సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మక్కల, వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వడ్ల, మక్కలకు కొనుగోలు కేంద్రాలను ఆలస్యం చేసింది . రైతులు ఇప్పటికే దళారులకు రూ.1600కు అమ్ముకోవడం జరిగిందన్నారు. ప్రతీ ఎకరానికి 18 క్వింటాళ్లు మాత్రమే మక్కలు కొంటాం అంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు కోతలు పెడుతున్నావని ప్రశ్నించారు. పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలి. దొంగలు పడ్డంక ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు పంట అంతా అమ్ముకున్న తర్వాత కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలి. ఇప్పటికే 14 వేల క్వింటాళ్ల వడ్లు కొనుగోలు చేశారు. రేవంత్ రెడ్డి పాలన ఆగమాగం.. సగం సగం, ఏదైనా పథకం కొనదాకా వెళ్లిందా..? అని ప్రశ్నించారు. రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయాలని.. అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలి డిమాండ్ చేశారు.

## జైషే మహ్మద్ మహిళా లీడర్‌గా మసూద్ సోదరి

ఇస్లామాబాద్: పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మొహమ్మద్ 'జమాత్ ఉల్ మొమినాత్' పేరుతో తన తొలి మహిళా విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల ప్రకటించింది. తాజాగా, జైష్ 'తుఫత్ అల్ ముమినాత్' పేరుతో ఆన్‌లైన్ శిక్షణా కోర్సును కూడా ప్రారంభించినట్లు తెలిపింది. దీని ద్వారా నిధులు సేకరించి, మరింతమంది మహిళలను ఆకర్షించాలని భావిస్తోంది. ఈ మహిళా బ్రిగేడ్‌కు మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నాయకత్వం వహించనున్నారు. మే నెలలో భారత దళాలు ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా మర్కజ్ సుభానల్లాలోని జైష్ కార్యాలయంపై దాడి చేసినప్పుడు ఆమె భర్త యూసుఫ్ అజార్ మరణించినట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో సంస్థను మరింత బలోపేతం చేయడంలో భాగంగా మరింతమంది మహిళలను నియమించుకోవాలని భావిస్తున్నారు. సంస్థను బలోపేతం చేయడం కోసం మరింత మంది మహిళలను నియమించుకోవాలని యోచిస్తున్నారు. మసూద్ అజార్, కుటుంబ సభ్యులు, అతని కమాండర్లు జిహాదీ, మతం, ఇస్లాంకు సంబంధించిన అంశాలపై మహిళలకు శిక్షణ ఇస్తారు" అని జైష్ ఏ మహమ్మద్ వర్గాలు తెలిపాయి. మహిళలను ఉగ్రవాదం వైపు మళ్లించేందుకు నవంబర్ 8 నుంచి ఆన్‌లైన్ లైవ్ క్లాస్‌లు ప్రారంభించనున్నారు.

## మా నాన్న పనైపోయింది


బెళగావి, అక్టోబర్ 22 (ఈవార్తలు) : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తన తండ్రి రాజకీయ జీవితం చివరి దశలో ఉందని ఆయన పేర్కొనడం గమనార్హం. అంతేకాకుండా, కర్ణాటకలో కాంగ్రెస్ నాయకత్వాన్ని చేపట్టడానికి సతీశ్ ఝర్కిహోళి అర్హుడని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు ముఖ్యమంత్రి మార్పు అంశంపై సంకేతాలు ఇస్తున్నట్లుగా ఉన్నాయి. స్వయంగా ముఖ్యమంత్రి కుమారుడే ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. బెళగావి జిల్లాలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో యతీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయాల్లో తన తండ్రి చివరి దశలో ఉన్నారని, ఈ సమయంలో బలమైన, ప్రగతిశీల భావజాలం కలిగిన నాయకుడు ఆయనకు అవసరమని అన్నారు. అటువంటి నాయకుడికి సిద్ధరామయ్య మార్గదర్శకంగా ఉంటారని ఆయన పేర్కొన్నారు.

# నవంబర్ లో స్థానిక ఎన్నికలు?

## నేటి కేబినెట్ లో కీలక నిర్ణయం!.. నవంబర్ 1 లోగా హైకోర్టుకు అఫిడవిట్!

**మళ్లీ షెడ్యూల్ జారీ చేయనున్న ఈసీ**

**నవంబర్ 3,4 వారాల్లో పోలింగ్?**




హైదరాబాద్, అక్టోబర్ 22 (ఈవార్తలు) : సర్కారు స్థానిక ఎన్నికలకు సిద్దమవుతోంది. వచ్చే నెలలో మళ్లీ షెడ్యూల్ జారీ అయ్యే అవకాశాలున్నాయి. ఇందుకోసం గురువారం కేబినెట్ మీటింగ్ నిర్వహిస్తున్నట్టు సమాచారం. గత నెల 17న స్థానిక ఎన్నికల నిర్వహణపై హైకోర్టులో దాఖలైన పిటిషన్ పై విచారించింది. ఈ సందర్భంగా ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారని న్యాయస్థానం ప్రశ్నించగా రెండు వారాల్లో చెబుతామని ఏజీ ధర్మాసనానికి తెలిపారు. నవంబర్ 1 లోగా ఎన్నికల నిర్వహణ ఎప్పుడనే విషయం కోర్టుకు తెలపాల్సి ఉంది. ఈ మేరకు అఫిడవిట్ వేయాల్సి ఉంటుంది. దీంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్ల నుంచి ప్రభుత్వానికి ఒత్తిడి కూడా ఉంది. ఈ క్రమంలో రేపటి కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. గతంలో ఈసీ జారీ చేసిన షెడ్యూల్ లో బీసీలకు 42% రిజర్వేషన్లు కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9 ప్రకారం అని ఉంది. ఇందులో జీవో నంబర్ 9 పై హైకోర్టు స్టే విధించింది. ఈ క్రమంలో కొత్త షెడ్యూల్ జారీ చేయాల్సి ఉంటుంది. కొత్త షెడ్యూల్ లో బీసీ రిజర్వేషన్లు పాత పద్ధతి ప్రకారం వెళ్లాల్సి వస్తే ఏం చేద్దాం..? అనే అంశంపైనే ప్రధానంగా కేబినెట్ లో చర్చించే అవకాశం ఉంది. ఎన్నికలు సకాలంలో నిర్వహించని పక్షంలో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోనున్నాయి. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉందనే వాదన కూడా బలంగానే ఉంది. ఒక వేళ ఎన్నికలకు వెళ్లాల్సి వస్తే.. పార్టీ పరంగా 42% సీట్లను బీసీలకు కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ 42% సీట్లను బీసీలకు కేటాయిస్తే మిగతా పార్టీలు కూడా ఫాలో అయ్యే అవకాశం ఉంది. అయితే బీసీ రిజర్వేషన్ల కోసం సర్వశక్తులు ఒడ్డామని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సహకరించలేదని ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా భారీగా స్థానాలను కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇదే క్రమంలో బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లలో బీఆర్ఎస్ ఇంప్లీడ్ కాలేదని, బీసీల పట్ల ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదని చెప్పే చాన్స్ ఉంది. ఇటీవల బీసీ బంద్ లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల చీఫ్ లు పాల్గొనలేదని, బీసీలకు మేలు చేసేది కాంగ్రెస్ మాత్రమేనని చెప్పుకొనే స్కోప్ కూడా కనిపిస్తోంది. ఏది ఏమైనా నవంబర్ మూడు లేదా నాలుగో వారంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహించాలనే దృష్టితోనే ప్రభుత్వం ముందుకెళ్తోందని సమాచారం.

# ప్రచారానికి కేంద్ర మంత్రులు, సీఎం

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బీజేపీ ప్రత్యేక దృష్టి**

**40 మందితో స్టార్ క్యాంపెయినర్ల జాబితా విడుదల**

**ప్రచార బరిలోకి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్**

రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ కూడా ప్రచారానికి



హైదరాబాద్, అక్టోబర్ 22 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికను భారతీయ జనతా పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ ఎన్నికల ప్రచారం కోసం ఏకంగా 40 మందితో కూడిన స్టార్ క్యాంపెయినర్ల జాబితాను విడుదల చేసి, తమ పూర్తిస్థాయి శక్తిని ప్రదర్శించేందుకు సిద్ధమైంది. ఈ జాబితాలో కేంద్ర మంత్రులు, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి సహా పలువురు జాతీయ, రాష్ట్ర స్థాయి అగ్రనేతలకు చోటు కల్పించడం ప్రాధాన్యం సంతరించుకుంది. జూబ్లీహిల్స్ ప్రచార బాధ్యతలను మోసే వారిలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వంటి కీలక నేతలు ఉన్నారు. ఈ ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యంగా బీజేపీ అధిష్ఠానం జాతీయ స్థాయి నాయకులను రంగంలోకి దించుతోంది. తెలంగాణ నుంచి కూడా పార్టీ ముఖ్య నేతలందరినీ ఈ జాబితాలో చేర్చింది. కేంద్ర మంత్రులు, సికింద్రాబాద్ ఎంపీ జి. కిషన్ రెడ్డి, కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌లతో పాటు తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు కూడా ప్రచారంలో పాల్గొననున్నారు. వీరితో పాటు మాజీ మంత్రులు ఈటల రాజేందర్, డీకే అరుణ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు వంటి ప్రముఖులు సైతం ప్రచార సారథులుగా వ్యవహరించనున్నారు. ఈ జాబితాలో బీజేపీ యువమోర్చా జాతీయ అధ్యక్షుడు తేజస్వి సూర్య, ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై వంటి పొరుగు రాష్ట్రాల నేతలకు కూడా స్థానం కల్పించారు. వీరితో పాటు డాక్టర్ కె. లక్ష్మణ్, ధర్మపురి అరవింద్, సుజనా చౌదరి, బూర నర్సయ్య గౌడ్, పొంగులేటి సుధాకర్ రెడ్డి, గరికపాటి మోహన్ రావు సహా మొత్తం 40 మంది నేతలు జూబ్లీహిల్స్‌లో పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారం చేయనున్నారు.

# రాష్ట్రంలో భారీ వర్షాలు: ఐఎండీ



హైదరాబాద్, అక్టోబర్ 22 (ఈవార్తలు): నైరుతి బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడింది. పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ గురువారం మధ్యాహ్నం నాటికి ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు ఆనుకొని ఉన్న నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారుతుందని వాతావరణశాఖ పేర్కొంది. ఆ తర్వాత పశ్చిమ-వాయువ్య దిశగా ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర వైపు కదులుతూ రాబోయే 24గంటల్లో మరింత బలపడే అవకాశాలున్నాయని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బుధవారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ పేర్కొంది. గురువారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శుక్రవారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. శనివారం వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని చెప్పింది. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, హన్మకొండ జిల్లాల్లో వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. ఈ మేరకు వాతావరణశాఖ ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.



## విద్యాసంస్థలకు బకాయిలు చెల్లించాలి

**లేదంటే తీవ్ర పరిణామాలు: బండి సంజయ్**

హైదరాబాద్, అక్టోబర్ 22 (ఈవార్తలు): ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి సరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. హైదరాబాద్ నల్లకుంటలోని శంకర మఠాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. పెండింగ్ ఫీజులన్నీ చెల్లించేవరకు విద్యాసంస్థలకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వ ఒత్తిడికి విద్యాసంస్థల యాజమాన్యాలు లొంగవద్దని సూచించారు. వాయిదా పద్ధతుల్లో చెల్లింపులకు అంగీకరించవద్దన్నారు. ప్రభుత్వాన్ని బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులతో బ్లాక్‌మెయిల్ చేస్తారా అని ప్రశ్నించారు. "బిహార్ ఎన్నికలకు డబ్బులు ఇక్కడి నుండే పంపుతున్నారు కదా.. విద్యార్థుల భవిష్యత్తు కోసం బకాయిలు చెల్లించలేరా? తక్షణమే వాటిని చెల్లించాలి. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవు. విద్యార్థులు, యాజమాన్యాలతో కలిసి మంత్రులను రోడ్లపై తిరగనీయం. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలకు సంబంధించి భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. గత పదేళ్ల భారత రాష్ట్ర సమితి పాలన, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో ఈ నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదు. జూబ్లీహిల్స్‌లో భాజపా గెలవడం ఖాయం" అని బండి సంజయ్ తెలిపారు. అటు.. కేంద్ర మంత్రి అమిత్ షాకు బండి సంజయ్ 'ఎక్స్' వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "నాకు రాజకీయ మార్గదర్శి, గురువు అమిత్ షా. దేశం ఫస్ట్ అనే ఆలోచనతో జీవించే, శ్వాసించే నేత ఆయన. రాజకీయాలను వ్యూహంతో, సేవతో చూడగల తత్వాన్ని అమిత్ షా నుంచే నేర్చుకుంటున్నా. ఎంతటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా అయోమయానికి గురికాకుండా ప్రశాంత మనసుతో ఆలోచించే నాయకుడు ఆయన. దీర్ఘాయుష్షు, ఆరోగ్యంతో నిండు నూరేళ్లు జీవించాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నా" అని పేర్కొన్నారు.



## రంగంలోకి దిగిన కేసీఆర్

**నేడు ముఖ్య నేతలతో కీలక సమావేశం**

సిద్దిపేట/హైదరాబాద్, అక్టోబర్ 22 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికను బీఆర్ఎస్ పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పార్టీ అధినేత కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి, ఎన్నికల వ్యూహరచనపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా గురువారం తన ఫామ్‌హౌస్‌లో పార్టీ ముఖ్య నేతలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో ఆయన కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఈ భేటీలో ఉపఎన్నిక ప్రచార సరళిపై చర్చించి, నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ సిట్టింగ్ స్థానాన్ని తిరిగి కైవసం చేసుకోవాలని బీఆర్ఎస్ పట్టుదలగా ఉంది. ఇప్పటికే ఆ పార్టీ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ అర్ధాంగి మాగంటి సునీతను ప్రకటించింది. ఆమె నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు 40 మంది స్టార్ క్యాంపెయినర్ల బృందం కూడా ప్రచారంలో చురుగ్గా పాల్గొంటోంది. అయితే, కేసీఆర్ స్వయంగా ప్రచారంలో పాల్గొంటారా? లేదా? అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. మరోవైపు, ఈ ఉపఎన్నికను కాంగ్రెస్, బీజేపీలు కూడా సవాలుగా తీసుకున్నాయి. కాంగ్రెస్ తరఫున నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి బరిలో నిలిచి తమ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. మూడు ప్రధాన పార్టీలు ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుండటంతో జూబ్లీహిల్స్‌లో రాజకీయ వేడి తారస్థాయికి చేరింది. ప్రధాన పార్టీలన్నీ ముమ్మర ప్రచారం నిర్వహిస్తుండటంతో నియోజకవర్గ ప్రజలు ఎవరికి పట్టం కడతారనేది ఆసక్తికరంగా మారింది.




## గెట్స్ సదస్సుకు కేటీఆర్‌కు ఆహ్వానం

హైదరాబాద్, అక్టోబర్ 22 (ఈవార్తలు): తెలంగాణ మాజీ ఐటీశాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుకు మరో అరుదైన గౌరవం దక్కింది. శ్రీలంక కొలంబోలో జరగబోయే ప్రతిష్ఠాత్మక 'గ్లోబల్ ఎకనామిక్ అండ్ టెక్నాలజీ సమ్మిట్ (గెట్స్) 2025' సదస్సులో ఆయనకు కీలకోపన్యాసం చేసేందుకు ఆహ్వానం అందింది. ఈ సదస్సు నవంబర్ 10 నుంచి 12 వరకు కొలంబోలోని 'ది కింగ్స్‌బరీ హోటల్'లో జరుగనున్నది. శ్రీలంక సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ తరఫున, జీఈటీఎస్ శ్రీలంక డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఏయూఎల్ఏ హిల్మీ కేటీఆర్‌కు ఆహ్వానాన్ని పంపారు. ఇన్నోవేషన్, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్, ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై చర్చించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న విధాన రూపకర్తలు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నాయకులను ఈ సదస్సు ఒకే వేదికపైకి తీసుకురానుంది. డాక్టర్ హిల్మీ తన లేఖలో ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి రంగాల్లో తెలంగాణను భారతదేశంలోనే అత్యంత శక్తివంతమైన కేంద్రంగా తీర్చిదిద్దడంలో కేటీఆర్ నాయకత్వాన్ని, పాత్రను కొనియాడారు. పెద్ద ఎత్తున పారిశ్రామిక, సాంకేతిక కార్యక్రమాలను ఆయన నడిపించిన విధానం, అనేక వర్ధమాన ఆర్థిక వ్యవస్థలకు ఒక ఆదర్శంగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. కేటీఆర్ సదస్సులో పాల్గొనడం వల్ల దక్షిణ ఆసియాలోని విధాన రూపకర్తలు, పారిశ్రామికవేత్తలు స్ఫూర్తి పొందుతారని సమ్మిట్ కార్యదర్శి తెలిపారు. అలాగే, సాంకేతిక, ఆర్థిక వృద్ధిలో భారతదేశం %-% శ్రీలంక సహకారాన్ని బలోపేతం చేయడానికి ఇది దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సదస్సుకు వివిధ దేశాల నుంచి మంత్రులు, పెట్టుబడిదారులు, స్టార్టప్ నాయకులు, ఆవిష్కర్తలు హాజరవుతారని, సుస్థిరమైన, సాంకేతికత ఆధారిత ఆర్థిక వ్యవస్థలను నిర్మించడంపై దృష్టి సారిస్తారని వివరించారు.

## జర్నలిస్టుల భూమిలో హైడ్రా ఫెన్సింగ్

పేట్ బషీరాబాద్, అక్టోబర్ 22 (ఈవార్తలు): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలోని ప్రభుత్వభూమి సర్వేనెంబర్ 25/1 25/2 లో హైడ్రా తన బోర్డు పాతేందుకు సిద్ధమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జర్నలిస్టుల కోసం 38 ఎకరాలు కేటాయించగా, ఈ స్థలంపై పలువురు కోర్టుకు వెళ్లారు. అయితే, బుధవారం ఆ స్థలానికి అధికారులు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 38 ఎకరాలు భూమిని స్వాధీనం చేసుకుంటున్నారు. దీనిపై జర్నలిస్టు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

## సిరిసిల్ల అడిషనల్ కలెక్టర్‌గా గరిమా అగర్వాల్

హైదరాబాద్, అక్టోబర్ 22 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల అడిషనల్ కలెక్టర్‌గా గరిమా అగర్వాల్‌ను ప్రభుత్వం నియమించింది. అలాగే, మరో ముగ్గురు అధికారుల అదనపు బాధ్యతల్లో మార్పులు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ కార్యదర్శిగా రఘునందర్‌రావుకు అదనపు బాధ్యతలు ఇచ్చారు. దేవాదాయశాఖ డైరెక్టర్‌గా ఎస్ హరీశ్‌కు, గనులశాఖ డైరెక్టర్ భవేష్ మిశ్రాకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలను గరిమా అగర్వాల్‌కు అప్పగించింది. గరిమా అగర్వాల్ ప్రస్తుతం సిద్దిపేట అదనపు కలెక్టర్‌గా సేవలందిస్తున్నారు. గరిమా అగర్వాల్ ఇంతకు ముందు కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా సేవలు అందించారు. 2019 ఐఏఎస్ బ్యాచ్ కి చెందిన గరీమా అగర్వాల్.. యాదాద్రి భువనగిరి జిల్లా ట్రైనీ కలెక్టర్‌గా రెండేళ్లు, కరీంనరగ్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా రెండేళ్లు పని చేశారు.

# అమరావతి లైబ్రరీకి శోభా గ్రూప్ రూ.100 కోట్లు

అమరావతి, అక్టోబర్ 22 (ఈవార్తలు): ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి భారీ ఊతం లభించింది. దుబాయ్‌కు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ దిగ్గజం శోభా రియాల్టీ గ్రూప్, అమరావతిలో ప్రపంచ స్థాయి గ్రంథాలయం (లైబ్రరీ) నిర్మాణానికి రూ.100 కోట్ల భారీ విరాళాన్ని ప్రకటించింది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో సీఎం చంద్రబాబు చేపట్టిన దుబాయ్ పర్యటనలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. దుబాయ్‌లో శోభా రియాల్టీ గ్రూప్ ఛైర్మన్ రవి మేనన్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రవి మేనన్ మాట్లాడుతూ.. అమరావతిలో గ్లోబల్ ప్రమాణాలతో ఒక స్టేట్ లైబ్రరీని ఏర్పాటు చేసేందుకు తమ సంస్థ తరఫున ఈ విరాళాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. శోభా గ్రూప్ తీసుకున్న ఈ నిర్ణయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. అమరావతిని ప్రపంచంలోని ఉత్తమ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్న తన ఆశయానికి ఈ విరాళం ఎంతగానో దోహదపడుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఏపీలో పెట్టుబడులకు గల అపార అవకాశాలను చంద్రబాబు



వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించేందుకు ఏపీకి రావాలని రవి మేనన్‌ను ఆయన ఆహ్వానించారు. అమరావతిని ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో అభివృద్ధి చేస్తున్నామని, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీ, విశాఖపట్నంలోని గూగుల్ డేటా సెంటర్ వంటి ప్రాజెక్టులు ఇప్పటికే పురోగతిలో ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. అమరావతి, విశాఖపట్నం, తిరుపతి వంటి నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్లు, పోర్టు ఆధారిత అభివృద్ధి జోన్లలో టౌన్‌షిప్‌లు, లగ్జరీ హోటళ్లు, ఐటీ పార్కులు, మాల్స్, కన్వెన్షన్ సెంటర్లు, ప్రీమియం హౌసింగ్ ప్రాజెక్టులు చేపట్టవచ్చని సూచించారు. శోభా గ్రూప్ తమ ఆదాయంలో 50 శాతం సామాజిక సేవా కార్యక్రమాలకు కేటాయించడాన్ని చంద్రబాబు ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం పీ4 నమూనాతో "జీరో పావర్టీ మిషన్" అమలు చేస్తున్నట్లు తెలిపారు. తమ సంస్థ దుబాయ్, ఒమన్, బహ్రెయిన్, ఖతార్, బ్రూనై దేశాలతో పాటు భారతదేశంలోని 14 రాష్ట్రాల్లోని 27 నగరాల్లో ప్రాజెక్టులు నిర్వహిస్తోందని రవి మేనన్ ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరుకావాలని శోభా రియాల్టీ యాజమాన్యాన్ని చంద్రబాబు ప్రత్యేకంగా ఆహ్వానించారు.

## ఉగ్రవాదంపై కలిసి పోరాడదాం

**ట్రంప్‌కు మోదీ చురకలు**

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీతో తాను ఫోన్‌లో మాట్లాడానని, పలు కీలక అంశాలపై ఆయన హామీ ఇచ్చారని ట్రంప్ ప్రకటించగా, అలాంటి ఫోన్ కాల్ ఏదీ జరగలేదని భారత ప్రభుత్వం స్పష్టం చేయడంతో గందరగోళం నెలకొంది. వైట్‌హౌస్‌లో జరిగిన దీపావళి వేడుకల సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, "నేను ఈరోజే మీ ప్రధానమంత్రితో మాట్లాడాను. మా మధ్య గొప్ప సంభాషణ జరిగింది. వాణిజ్యంతో పాటు అనేక విషయాలు చర్చించాం" అని విలేకరులతో అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ గణనీయంగా తగ్గిస్తుందని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ పునరుద్ఘాటించారు. అంతేకాకుండా, గతంలో భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తాను ఆపగలిగానని మరోసారి వ్యాఖ్యానించారు. అయితే, ట్రంప్ చేసిన ఈ ప్రకటనలను భారత ప్రభుత్వం తోసిపుచ్చింది. ప్రధాని మోదీకి, ట్రంప్‌కు మధ్య జరిగిన దీపావళి ఫోన్ సంభాషణలో ఇలాంటి అంశం ప్రస్తావనకు రాలేదని స్పష్టం చేసింది. ఇంధన దిగుమతులపై భారత్ తన ప్రయోజనాలను కాపాడుకుంటుందని, వినియోగదారుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని పరోక్షంగా ఓ ప్రకటన విడుదల చేసింది. మరోవైపు, ప్రధాని నరేంద్ర మోదీ ఆన్‌లైన్‌లో ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దీపావళి శుభాకాంక్షలు తెలిపినందుకు ధన్యవాదాలు చెబుతూనే, ఆయన వ్యూహాత్మకంగా స్పందించారు. "మీ ఫోన్ కాల్, దీపావళి శుభాకాంక్షలకు ధన్యవాదాలు. ఈ వెలుగుల పండుగ సందర్భంగా మన రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాలు ప్రపంచానికి ఆశాకిరణంగా నిలవాలి. అన్ని రకాల ఉగ్రవాదంపై కలిసికట్టుగా పోరాడాలి" అని తన పోస్టులో పేర్కొన్నారు. ఉగ్రవాదంపై పోరాటానికి ప్రాధాన్యం ఇస్తూ మోదీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## జీవికా దీదీలకు నెలకు రూ.30 వేలు

**తేజస్వి యాదవ్ భారీ హామీ**



పాట్నా: బీహార్ ఎన్నికల రాజకీయాలు వేడెక్కుతున్న తరుణంలో, మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఒక భారీ హామీని ప్రకటించారు. రాష్ట్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే, స్వయం సహాయక బృందాల్లో పనిచేస్తున్న 'జీవికా దీదీ' కమ్యూనిటీ కార్యకర్తలకు ప్రతి నెలా రూ.30,000 గౌరవ వేతనం చెల్లిస్తామని ఆయన స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, ఈ హామీలతో మహిళా ఓటర్లలో కొత్త చర్చకు తెరలేపారు. కేవలం వేతనం ఇవ్వడమే కాకుండా, వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తామని కూడా తేజస్వి హామీ ఇచ్చారు. జీవికా దీదీలు తీసుకున్న రుణాలన్నింటినీ మాఫీ చేస్తామని ప్రకటించారు. భవిష్యత్తులో వారికి వడ్డీ లేని రుణాలు, రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తామని హామీల వర్షం కురిపించారు. బీహార్‌లో దాదాపు 10 లక్షల మంది ఉన్న జీవికా దీదీలే లక్ష్యంగా ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఎన్డీయే ప్రభుత్వంపై తేజస్వి విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు మహిళల ఖాతాల్లో రూ.10 వేలు జమ చేయడాన్ని ఆయన 'లంచం'గా అభివర్ణించారు. ఆ మొత్తం సాయం కాదని, రుణమని స్వయంగా కేంద్రమంత్రి అమిత్ షానే చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. భవిష్యత్తులో ప్రభుత్వం ఆ డబ్బును తిరిగి వసూలు చేస్తుందని ఆయన అన్నారు. గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత లక్ష్యంగా బీహార్ ప్రభుత్వం 2007లో 'జీవిక' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని కింద స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేసి మహిళలకు రుణాలు, శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

# ఆస్ట్రేలియాకు ఏపీ రొయ్యలు

**ఎనిమిదేళ్ల తర్వాత గ్రీన్ సిగ్నల్**



సిడ్నీ: అమెరికా విధించిన భారీ సుంకాలతో తీవ్రంగా దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ రొయ్యల పరిశ్రమకు భారీ ఊరట లభించింది. దాదాపు ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత, భారత రొయ్యల దిగుమతికి ఆస్ట్రేలియా షరతులతో కూడిన అనుమతులు మంజూరు చేసింది. ఈ పరిణామం దేశీయ రొయ్యల ఎగుమతుల్లో 80 శాతం వాటా కలిగిన ఏపీ రైతులకు కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఏడు రోజుల పర్యటనలో ఉన్న ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ శుభవార్తను స్వయంగా ప్రకటించారు. "భారత సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులకు ఎప్పటినుంచో అడ్డంకిగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించింది. వైట్ స్పాట్ వైరస్ కారణంగా ఆస్ట్రేలియా విధించిన పరిమితులు తొలగిపోయాయి. భారత రొయ్యలకు తొలి దిగుమతి అనుమతి లభించింది. ఇది ఈ రంగంలో ఒక పెద్ద ముందడుగు" అని లోకేశ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలిపారు. 2017 జనవరిలో కొన్ని రొయ్యల సరుకుల్లో 'వైట్ స్పాట్ వైరస్' గుర్తించడంతో ఆస్ట్రేలియా ప్రభుత్వం భారత్ నుంచి పొట్టు తీయని రొయ్యల దిగుమతులపై నిషేధం విధించింది. అప్పటి నుంచి భారత ఎగుమతిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు, ఇటీవల ట్రంప్ హయాంలో అమెరికా ప్రభుత్వం భారత రొయ్యలపై 59.72 శాతం వరకు సుంకాలు విధించడంతో ఏపీ రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతంలో ఏపీ నుంచి 70 శాతం రొయ్యలు అమెరికాకే ఎగుమతి అయ్యేవి. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా మార్కెట్ తిరిగి తెరుచుకోవడం కీలకంగా మారింది.

# త్వరలోనే రాజయ్యపేటకు జగన్



వైజాగ్, అక్టోబర్ 22 (ఈవార్తలు) : బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు ప్రతిపాదనతో అట్టుడుకుతున్న అనకాపల్లి జిల్లా రాజయ్యపేటలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ పార్కును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుండగా, వారికి సంఘీభావం తెలిపేందుకు వైసీపీ నేతలు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా తమ గోడును విన్నవించిన మత్స్యకార మహిళలు.. ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఎదుట తమ ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారుల సమస్యలను విన్న బొత్స సత్యనారాయణ వారికి భరోసా ఇచ్చారు. త్వరలోనే మాజీ ముఖ్యమంత్రి జగన్ రాజయ్యపేటకు వస్తారని, పార్టీ మొత్తం మత్స్యకారులకు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. "బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తున్న ప్రజలు సంఘ విద్రోహ శక్తులా? ఈ నిర్బంధం ఎందుకు?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. హోంమంత్రి అనితకు పాలన చేతకాకపోతే రాజకీయాల నుంచి తప్పుకోవాలని తీవ్రస్థాయిలో విమర్శించారు. గ్రామస్తుల అభిప్రాయాలను జగన్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు. మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్ కూడా ప్రభుత్వంపై, హోంమంత్రి అనితపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు బల్క్ డ్రగ్ పార్క్ వల్ల క్యాన్సర్లు వస్తాయని చెప్పి, అధికారంలోకి వచ్చాక మాట మార్చారని కన్నబాబు ఆరోపించారు. అనితను గెలిపించినందుకు ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారని అన్నారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా, 2029లో అధికారంలోకి రాగానే వాటన్నింటినీ ఎత్తివేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మాజీ మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ.. వైసీపీ మొదటి నుంచి బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకమని గుర్తుచేశారు. "గ్రామంలోకి రావాలంటే పోలీసులు ఆధార్ కార్డులు అడుగుతున్నారు. మరికొన్ని రోజులు పోతే పాస్‌పోర్టులు కూడా అడుగుతారేమో. వందల ఏళ్లుగా ఇక్కడే బతుకుతున్న ప్రజలు ఈ దేశ పౌరులు కారా?" అని ఆయన ప్రశ్నించారు.



# 7న ఏపీ కేబినెట్ భేటీ

అమరావతి, అక్టోబర్ 22 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం నవంబరు 7వ తేదీన జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ సమావేశం జరగనుండగా, ఇందులో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. కొన్ని ముఖ్యమైన అంశాలను ఆమోదించనున్నారు. ప్రతి నెల రెండు సార్లు ఏపీ కేబినెట్ భేటీ నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భాగంగా నవంబర్ నెలలో మొదటి కేబినెట్ బేటీ 7వ తేదీన జరపాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. అజెండాలోని అంశాలకు సంబంధించి అన్ని శాఖలు ప్రతిపాదనలను నవంబర్ 5వ తేదీ సాయంత్రానికి పంపించాలని సీఎస్ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ కేబినెట్ భేటీలో ప్రధానంగా నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ సదస్సుపై చర్చించనున్నారు. సదస్సుపై ఇప్పటికే మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించిన నేపథ్యంలో కమిటీ సూచనలపై కూడా కేబినెట్ భేటీలో చర్చించనున్నారు. దీంతో పాటు రాజధాని అమరావతి పనులు, వివిధ సంస్థలకు భూముల కేటాయింపులపై కూడా కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇదే సందర్భంలో ప్రభుత్వ నిర్ణయాలపై ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలు, విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టే విషయంపై మంత్రులకు సీఎం చంద్రబాబు కీలక సూచనలు చేయనున్నారని సమాచారం.



## అర మార్కు తక్కువొచ్చినా పాసే!

**ఏపీ ఇంటర్ విద్యార్థులకు ఊరట**

**ఎన్‌సీఈఆర్టీ అమలుతో**

**పరీక్షా విధానంలో సంస్కరణలు**

అమరావతి, అక్టోబర్ 22 (ఈవార్తలు): ఏపీలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు విద్యా మండలి శుభవార్త అందించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను అమలు చేస్తున్న నేపథ్యంలో పరీక్షా విధానంలో పలు కీలక సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రాక్టికల్స్ ఉన్న సైన్స్ సబ్జెక్టుల రాత పరీక్షల్లో అర మార్కు సడలింపు ఇస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీనివల్ల విద్యార్థులు అర మార్కు తేడాతో ఫెయిల్ అయ్యే ఆందోళన తొలగిపోనుంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ వంటి సబ్జెక్టులకు ఈ మార్పు వర్తిస్తుంది. గతంలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల రాత పరీక్షల్లో కలిపి ఉత్తీర్ణత సాధించాలంటే కనీసం 59.50 మార్కులు అవసరం కాగా, ఇప్పుడు దాన్ని 59 మార్కులకు తగ్గించారు. అంటే, అర మార్కు తక్కువ వచ్చినా విద్యార్థులను పాసైనట్లుగానే పరిగణిస్తారు. ఈ అర మార్కును సెకండ్ ఇయర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో సర్దుబాటు చేయనున్నట్లు బోర్డు స్పష్టం చేసింది. దీని ప్రకారం ప్రాక్టికల్స్‌లో పాస్ మార్కును 10.5 నుంచి 11 మార్కులకు పెంచారు.

## తూర్పు కాపు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉహామహంతి



విజయవాడ, అక్టోబర్ 22 (ఈవార్తలు): విజయవాడలో జాతీయ, రాష్ట్ర తూర్పు కాపు సంక్షేమ సంఘ మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ మహాసభలో జాతీయ అధ్యక్షుడిగా పిసిని చంద్రమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికవగా, రాష్ట్ర నూతన కార్యవర్గం కూడా ఏకగ్రీవంగా ఏర్పడింది. ఈ సందర్భంగా ప్రముఖ సామాజిక సేవకురాలు, ఏపీకి చెందిన డాక్టర్ ఉహ మహంతి (విశాఖపట్నం) తూర్పు కాపు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'తూర్పు కాపు మహిళల విద్య, సాధికారత, ఉపాధి అవకాశాలు, సామాజిక ప్రగతికి కృషి చేయడం నా ప్రధాన లక్ష్యం. నాపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన జాతీయ అధ్యక్షుడు చంద్రమోహన్‌కు, జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులందరికీ, రాష్ట్ర తూర్పు కాపు సంఘ పెద్దలు, నాయకులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. తూర్పు కాపు మహిళల సంక్షేమం, విద్య, ఉపాధి అవకాశాలు, సామాజిక సమానత్వం కోసం కార్యక్రమాలు చేపట్టి సమాజ అభివృద్ధికి కృషి చేస్తా'నని పేర్కొన్నారు.



## భూ భారతిపై అవగాహన కచ్చితం

**జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**

జగిత్యాల టౌన్, అక్టోబర్ 22 (ఈవార్తలు): భూభారతి చట్టంపై ప్రతీ ఒక్క జీపీవో అవగాహన కలిగి ఉండాలని జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. బుధవారం కలెక్టరేట్లో 218 మంది నూతన జీపీవోలకు విధులు, బాధ్యతలపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి రెవిన్యూ క్లస్టర్‌కు ఒక గ్రామ పాలనాధికారి ( జీపివో ) ఉంటారని తెలిపారు. గ్రామ పాలనాధికారులు రికార్డుల నిర్వహణ, భూమి హక్కుల రికార్డు (ఆర్ఓఆర్), వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, వారసత్వంగా వచ్చిన భూములను మ్యూటేషన్, ఇతర మార్గాల ద్వారా వచ్చిన భూమికి మ్యూటేషన్, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, పట్టాదారు పాసుపుస్తకాలు, వివిధ రకాల రెవెన్యూ సర్వీసుల గురించి నూతన జీపివోలకు శిక్షణ, అవగాహన కల్పించడం కల్పించినట్లు తెలిపారు. జీపీవోలు గ్రామ పటం, ప్రాథమిక సమాచారం, నీరు, ఇసుక, ఇతర మైనింగ్ కార్యకలాపాలపై నియంత్రణతో పాటు, కులం, నివాసం,ఆదాయం, లోకల్ ఏరియా, ఇతర ధ్రువీకరణ పత్రాల మంజూరు కొరకు విచారణ నివేదికలో క్రియాశీలంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. విలేజ్ మ్యాప్ కచ్చితంగా విధి నిర్వహణలో వెంట ఉండాలని, సెత్వార్, ఖాస్రా వంటి రికార్డులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు, అసాధారణ సంఘటనలు జరిగినప్పుడు స్థానికంగా ఉండాలని, ప్రాథమిక సమాచారం మండల తహసీల్దార్, ఉన్నతాధికారులకు తెలియజేయాలని అన్నారు. శిఖం భూములు, ప్రభుత్వ భూముల ఆక్రమణ జరగకుండా నెలలో కనీసం రెండుసార్లు సందర్శించాలని చెప్పారు. గ్రామాల్లోని ఇసుక, మట్టి అక్రమ రవాణా అరికట్టాల్సిన బాధ్యత జీపీవోలదేనని వెల్లడించారు.

## అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 22 (ఈవార్తలు): జగిత్యాల, మంచిర్యాల, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 2న మెట్‌పల్లిలో, 13న ధరూర్‌లోని ఇండ్లలో దొంగతనాలు చేసిన సాయినాథ్ (20), శ్రీకాంత్ (29), అనిల్ (30) నిందితులను పట్టుకొన్నారు. వీరివద్ద బంగార చైన్లు-2, గోల్డ్ రింగ్-1, గోల్డ్ చైన్-1, గోల్డ్ నోస్ పిన్-1, గోల్డ్ చెవి కమ్మలు-1, గోల్డ్ రింగ్ -1.. మొత్తం 24.5 గ్రాములు సహా రూ.19 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు.

## తెల్లారితే ఇంటికి.. అంతలోనే గుండె పోటు



పెగడపల్లి, అక్టోబర్ 22 (ఈవార్తలు): తెల్లారితే సొంతూరుకి వెళ్ళడానిక్ టికెట్ బుక్ చేసుకుని ఆనందంలో ఉన్న అతనిని మృత్యువు కాటేసింది. దేశం కాని దేశంలో గుండెపోటుతో కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన నిమ్మన రమేశ్ అనే వ్యక్తి ఏడాది క్రితం ఉపాధి నిమిత్తం ఇరాక్‌కు వలస వెళ్లగా బుధవారం తన సొంతూరు పెగడపల్లికి వచ్చేందుకు టికెట్ బుక్ చేసుకున్నాడు. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా గుండె పోటు రాగా, గమనించిన మిత్రులు ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడని తెలిపారు. తెల్లారితే తమవాడు ఇంటికి వస్తున్నాడన్న ఆనందంలో ఉన్న కుటుంబ సభ్యులకు రమేశ్ మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది.

## తీవ్ర జ్వరంతో ఏడేళ్ల చిన్నారి మృతి




మల్యాల, అక్టోబర్ 22 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రానికి చెందిన మల్యాల రవి కుమార్తె హృదయశ్రీ(7) తీవ్ర జ్వరంతో బాధపడుతూ బుధవారం సాయంత్రం మృతిచెందింది. పది రోజులుగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ, పరిస్థితి విషమించడంతో ఆమె చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## గల్ఫ్ ప్రవాసులకు ప్రవాసాంధ్ర భరోసా

దుబాయ్: గల్ఫ్ దేశాల్లోని ప్రవాసాంధ్రులకు భరోసా కల్పించే దిశగా ఏపీ ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. సీఎం చంద్రబాబు తన యూఏఈ పర్యటనలో భాగంగా 'ప్రవాసాంధ్ర భరోసా' అనే ప్రత్యేక బీమా పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద దురదృష్టవశాత్తు ప్రవాసీయులు మరణిస్తే వారి కుటుంబానికి రూ. 10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందనుంది. మూడు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం దుబాయ్ చేరుకున్న సీఎం చంద్రబాబుకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. స్థానిక భారత కాన్సుల్ జనరల్ సతీశ్ కుమార్ శివన్, టీడీపీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ, దుబాయ్ నగర టీడీపీ అధ్యక్షుడు విశ్వేశరరావు, ఇతర అధికారులు ఆయనను సాదరంగా ఆహ్వానించారు. పెద్ద సంఖ్యలో ప్రవాసాంధ్ర మహిళలు కూడా తరలివచ్చి స్వాగతం పలకడం విశేషం. ఈ సందర్భంగా టీడీపీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ మాట్లాడుతూ, ప్రవాసాంధ్ర భరోసా పథకం ఆపదలో ఉన్న ప్రవాసీ కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తుందని తెలిపారు. కష్టకాలంలో వారిని ఆదుకునేందుకే ఈ పథకాన్ని రూపొందించినట్లు ఆయన వివరించారు.

# ఢిల్లీని కమ్మేసిన విషపు పొగ





## 'చాలా ప్రమాదకరం' కేటగిరీకి పడిపోయిన వాయు నాణ్యత.. పలు ప్రాంతాల్లో 400 దాటిన వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ)

## అమల్లోకి వచ్చిన గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ రెండో దశ.. రానున్న రోజుల్లో మరింత దిగజారే అవకాశం ఉందని హెచ్చరిక

న్యూఢిల్లీ: దీపావళి పండగ ముగిసి రెండు రోజులు గడిచినా, దాని ప్రభావం దేశ రాజధాని ఢిల్లీని ఇంకా వీడలేదు. నగరాన్ని దట్టమైన పొగమంచు కప్పేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరడంతో ఢిల్లీ గాలి నాణ్యత బుధవారం 'చాలా ప్రమాదకరం' కేటగిరీకి పడిపోయింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) వెల్లడించిన వివరాల ప్రకారం, బుధవారం నగరం సగటు వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 345గా నమోదైంది. ఉదయం 6:15 గంటల సమయంలో అశోక్ విహార్, బవానా, దిల్షాద్ గార్డెన్ వంటి ప్రాంతాల్లో ఏక్యూఐ 380కి చేరి పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. డీటీయూ, ఐజీఐ ఎయిర్‌పోర్ట్, లోధీ రోడ్ వంటి కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఏక్యూఐ 300 లోపు ఉండి 'ప్రమాదకరం' కేటగిరీలో ఉంది. ద్వారక (417), వజీర్‌పూర్ (423), ఆనంద్ విహార్ (404), అశోక్ విహార్ (404) సహా నాలుగు ప్రాంతాల్లో వాయు నాణ్యత 'తీవ్రమైన' స్థాయికి పడిపోయినట్లు సీపీసీబీకి చెందిన 'సమీర్' యాప్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ (ఐఐటీఎం) అంచనాల మేరకు ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) రెండో దశను అమలులోకి తెచ్చారు. ఢిల్లీ కాలుష్యానికి కేవలం బాణసంచా మాత్రమే కారణం కాదని, ఇతర అంశాలు కూడా దోహదపడుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. సోమవారం నాటి కాలుష్యంలో వాహనాల నుంచి వెలువడిన పొగ వాటా 15.6% కాగా, పరిశ్రమలు, ఇతర వనరుల వాటా 23.3%గా ఉందని డెసిషన్ సపోర్ట్ సిస్టమ్ (డీఎస్ఎస్) తెలిపింది. ఈ కాలుష్యం వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, కళ్ల మంటలు వంటి ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ఈ కాలుష్యం ఈరోజు కొత్తగా వచ్చింది కాదు, ఏళ్లుగా పెరుగుతూనే ఉంది. అందరూ రాజకీయ నాయకులను నిందిస్తారు, కానీ ప్రజల బాధ్యత కూడా ఉంది. టపాసులు కాల్చడం మన ఇష్టమే కదా, ఆ తర్వాత ప్రభుత్వం ఏమీ చేయడం లేదని ఫిర్యాదు చేస్తారు" అని సాగర్ అనే స్థానిక నివాసి తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. సుప్రీంకోర్టు గ్రీన్ క్రాకర్స్‌కు మాత్రమే అనుమతి ఇచ్చినప్పటికీ, పరిస్థితి తీవ్రంగా ఉండటం గమనార్హం.

## పాక్‌పై అఫ్ఘన్ మండిపాటు

కాబూల్: అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్‌కు మధ్య జరుగుతున్న సరిహద్దు ఘర్షణల వెనుక భారత్ హస్తం ఉందంటూ పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలను అఫ్ఘనిస్థాన్ తీవ్రంగా ఖండించింది. ఆ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, అర్థరహితమని కొట్టిపారేసింది. ఈ క్లిష్ట సమయంలో భారత్‌తో తమ సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటామని స్పష్టం చేస్తూ పాకిస్థాన్‌కు గట్టి షాక్ ఇచ్చింది. అల్ జజీరా వార్తా సంస్థకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో అఫ్ఘనిస్థాన్ రక్షణ మంత్రి మహ్మద్ యాకూబ్ ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత్‌పై చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవి, అహేతుకమైనవి, ఏమాత్రం ఆమోదయోగ్యం కానివి. మా భూభాగాన్ని ఇతర దేశాలకు వ్యతిరేకంగా ఉపయోగించాలనే విధానం మాకు లేదు. ఒక స్వతంత్ర దేశంగా భారత్‌తో మాకు సంబంధాలు ఉన్నాయి. మా జాతీయ ప్రయోజనాల మేరకు ఆ బంధాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటాం" అని తాలిబన్ వ్యవస్థాపకుడు ముల్లా ఒమర్ కుమారుడైన యాకూబ్ స్పష్టం చేశారు. ఇటీవల అక్టోబర్ 11న అఫ్ఘనిస్థాన్-పాకిస్థాన్ సరిహద్దుల్లో ఘర్షణలు తీవ్రమయ్యాయి. తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) వంటి ఉగ్రవాద సంస్థలకు అఫ్ఘన్ ఆశ్రయం ఇస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలోనే, అఫ్ఘనిస్థాన్‌తో తమ సంబంధాలు దెబ్బతినడానికి భారతే కారణమని, తాలిబన్ ప్రభుత్వం భారత్ ఒడిలో కూర్చొని తమపై ప్రాక్సీ యుద్ధం చేస్తోందని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తీవ్ర ఆరోపణలు చేశారు. పాకిస్థాన్ చేసిన ఈ ఆరోపణలను భారత్ కూడా దీటుగా తిప్పికొట్టింది. ఉగ్రవాద సంస్థలకు ఆశ్రయం కల్పిస్తూ, తమ అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి పొరుగు దేశాలపై నిందలు వేయడం పాకిస్థాన్‌కు అలవాటేనని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ బదులిచ్చారు. ప్రస్తుతం తాలిబన్ ప్రభుత్వాన్ని భారత్ అధికారికంగా గుర్తించనప్పటికీ, ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి అధికారుల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ తరుణంలో అఫ్ఘన్ రక్షణ మంత్రి చేసిన తాజా వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## హెచ్-1బీ.. వాల్‌మార్ట్ షాక్!

**నియామకాలకు తాత్కాలిక బ్రేక్ వేస్తున్నట్లు వెల్లడి**

న్యూయార్క్: ప్రపంచ ప్రఖ్యాత రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్... హెచ్-1బీ వీసాలపై అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే వారికి షాకిచ్చింది. ట్రంప్ ప్రభుత్వం కొత్తగా విధించిన లక్ష డాలర్ల భారీ ఫీజు కారణంగా, హెచ్-1బీ వీసా అవసరమైన అభ్యర్థులకు ఉద్యోగ ఆఫర్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరిణామం పలు పరిశ్రమలలో నియామకాల ప్రణాళికలను తీవ్రంగా ప్రభావితం చేస్తోందని బ్లూమ్‌బర్గ్ నివేదించింది. ఈ కొత్త మార్గదర్శకం ప్రధానంగా వాల్‌మార్ట్‌లోని కార్పొరేట్ ఉద్యోగులపై ప్రభావం చూపుతుందని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. అమెరికాలో కంపెనీకి ఉన్న మొత్తం 16 లక్షల మంది ఉద్యోగులతో పోలిస్తే ఇది చాలా తక్కువ శాతమే అయినప్పటికీ, హెచ్-1బీ వీసాలపై ఆధారపడే విదేశీ నిపుణులకు ఇది పెద్ద దెబ్బే. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ప్రస్తుతం వాల్‌మార్ట్‌లో సుమారు 2,390 మంది హెచ్-1బీ వీసా హోల్డర్లు పనిచేస్తున్నారు. అమెరికాలోని ఇతర రిటైల్ సంస్థలతో పోలిస్తే ఇదే అత్యధికం. ఈ నియామకాల నిలిపివేత తాత్కాలికమేనని వాల్‌మార్ట్ చెబుతున్నప్పటికీ, కొత్త విధానం వల్ల తలెత్తిన గందరగోళానికి ఇది అద్దం పడుతోంది.

# రష్యా చమురుకు బ్రేక్?

## భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారుకు రంగం సిద్ధం

**భారత ఉత్పత్తులపై 15 శాతానికి సుంకాలు**

**మోదీ, ట్రంప్ మధ్య ఫోన్‌లో కీలక చర్చలు**




న్యూఢిల్లీ/వాషింగ్టన్: భారత్, అమెరికా మధ్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందంపై చర్చలు చివరి దశకు చేరుకున్నాయి. ఈ ఒప్పందం కార్యరూపం దాల్చితే భారత ఉత్పత్తులపై అమెరికా విధిస్తున్న సుంకాలను 50 శాతం నుంచి 15-16 శాతానికి తగ్గించే అవకాశం ఉందని 'మింట్' పత్రిక ఒక కథనాన్ని ప్రచురించింది. అయితే, ఇంధనం, వ్యవసాయ రంగాలే కీలకంగా ఉన్న ఈ ఒప్పందంలో భాగంగా భారత్.. రష్యా నుంచి ముడి చమురు దిగుమతులను క్రమంగా తగ్గించుకోవాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఈ పరిణామాల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఫోన్‌లో సంభాషించారు. ఈ సంభాషణలో ప్రధానంగా వాణిజ్యం, ఇంధన అంశాలపై చర్చించినట్లు ట్రంప్ స్వయంగా వెల్లడించారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పరిమితం చేస్తామని ప్రధాని మోదీ తనకు హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. మరోవైపు ప్రధాని మోదీ కూడా ట్రంప్‌తో మాట్లాడినట్లు ధ్రువీకరించారు. దీపావళి శుభాకాంక్షలు తెలిపినందుకు ట్రంప్‌కు ధన్యవాదాలు తెలుపుతూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అయితే, చర్చించిన అంశాల వివరాలను ఆయన వెల్లడించలేదు. ఉగ్రవాదంపై రెండు దేశాలు కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ ఒప్పందంలో భాగంగా, జన్యుమార్పిడి చేయని అమెరికా మొక్కజొన్న, సోయామీల్ దిగుమతులకు భారత్ అనుమతించే అవకాశం ఉందని సమాచారం. సుంకాలు, మార్కెట్ యాక్సెస్ వంటి అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేయవచ్చని తెలుస్తోంది. ఈ నెలలో జరగనున్న ఆసియాన్ సదస్సులోనే ఈ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై తుది ప్రకటన వెలువడవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ విషయంపై వ్యాఖ్యానించేందుకు భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వైట్ హౌస్ వెంటనే స్పందించలేదు.

### వ్యవసాయ ఉత్పత్తుల కోసం ట్రంప్ పట్టు

భారత్, అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందంలో అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు కీలకంగా మారాయి. తమ వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ తలుపులు బార్లా తెరవాలని ట్రంప్ పట్టుబడుతున్నారు. ఈ డిమాండ్ కు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో చర్చలు ముందుకు సాగడంలేదు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు జరపడంపైనా ట్రంప్ ఆగ్రహంగా ఉన్నారు. అయితే, ఇటీవల జరిగిన చర్చల్లో ఈ అంశాలపై పరస్పర అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది. రష్యా నుంచి దిగుమతులు క్రమంగా తగ్గించడంతో పాటు అమెరికా మొక్కజొన్న, సోయామీల్‌ను కూడా భారత మార్కెట్లోకి అనుమతించే అవకాశం ఉన్నట్లు సదరు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే మొక్కజొన్నపై 15 శాతం దిగుమతి సుంకం కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. ట్రేడ్ వార్ పరిస్థితుల నేపథ్యంలో అమెరికా నుంచి మొక్కజొన్న దిగుమతులను చైనా తగ్గించుకుంది. ఈ పరిస్థితుల్లో తమ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ట్రంప్ ప్రత్యామ్నాయంగా భారత మార్కెట్లలోకి ఎంట్రీ ఇవ్వాలని ప్రయత్నిస్తున్నారు.

# రోజుకు రూ.94 వేల కోట్లు

**యూపీఐ చెల్లింపుల్లో ఆల్-టైమ్ రికార్డ్!**

**పండగ సీజన్‌లో భారీగా యూపీఐ లావాదేవీలు**

**సెప్టెంబర్‌తో పోలిస్తే 13 శాతం వృద్ధి నమోదు**

**నెల మొత్తం విలువ**

**28 లక్షల కోట్లు దాటుతుందని అంచనా**

న్యూఢిల్లీ: పండగ సీజన్ కావడంతో డిజిటల్ చెల్లింపులు సరికొత్త శిఖరాలకు చేరుకున్నాయి. ముఖ్యంగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు మునుపెన్నడూ లేనంతగా పెరిగి ఆల్-టైమ్ రికార్డులను సృష్టిస్తున్నాయి. దీపావళి కొనుగోళ్ల జోరుతో యూపీఐ చెల్లింపుల వ్యవస్థ సరికొత్త మైలురాళ్లను అధిగమించింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం, అక్టోబర్ నెలలో యూపీఐ ద్వారా జరుగుతున్న సగటు రోజువారీ లావాదేవీల విలువ ఏకంగా రూ. 94,000 కోట్లకు చేరింది. సెప్టెంబర్ నెలతో పోలిస్తే ఇది 13 శాతం అధికం కావడం గమనార్హం. గత కొన్నేళ్లుగా నెలవారీగా చూస్తే ఇదే అత్యధిక వృద్ధి అని నిపుణులు చెబుతున్నారు. ఈ నెల ఇంకా వారం రోజులు మిగిలి ఉండగానే, యూపీఐ తన జీవితకాలంలోనే అత్యుత్తమ నెలవారీ ప్రదర్శనను నమోదు చేసే దిశగా దూసుకెళ్తోంది. దీనికి దీపావళి పండగతో పాటు ఇటీవల జీఎస్టీ రేట్లలో వచ్చిన మార్పులు కూడా కారణంగా నిలుస్తున్నాయి. ఈ నెల 20న దీపావళి సందర్భంగా చెల్లింపులు భారీగా పెరిగాయి. పండగకు ముందు రోజు యూపీఐలో ఒక్కరోజే 74 కోట్ల లావాదేవీలు జరిగి ఆల్-టైమ్ రికార్డు సృష్టించాయి. ఈ నెలలో ఇప్పటివరకు సగటున రోజుకు 69.5 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. సెప్టెంబర్‌లోని 65.4 కోట్ల రికార్డును ఇది అధిగమించింది. సాధారణంగా నెల ఆరంభంలో జీతాలు, ఈఎంఐ చెల్లింపుల కారణంగా లావాదేవీలు ఎక్కువగా ఉండి, నెల మధ్యకు వచ్చేసరికి తగ్గుముఖం పడతాయి. కానీ, ఈసారి పండగ ప్రభావంతో ఆ ధోరణి మారింది. ఈ నెల 20 నాటికే, రోజువారీ లావాదేవీల విలువ ఆరుసార్లు లక్ష కోట్ల రూపాయల మార్కును దాటింది. సెప్టెంబర్‌లో ఈ ఘనత కేవలం మూడుసార్లే నమోదైంది. ఈ దూకుడు చూస్తుంటే, ఈ నెలలో మొత్తం లావాదేవీల విలువ తొలిసారిగా రూ. 28 లక్షల కోట్లు దాటుతుందని, గత రికార్డయిన రూ. 25 లక్షల కోట్ల మార్కును అధిగమిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దేశంలోని మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో దాదాపు 85 శాతం వాటా యూపీఐదే కావడం విశేషం.




## సత్యనాదెళ్లకు 96.5 మిలియన్ డాలర్ల ప్యాకేజీ

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో విజయాలే కారణం**

**గత పదేళ్లలో ఇదే అత్యధిక వేతనం అని వెల్లడి**

**వేతనంలో 90 శాతం కంపెనీ షేర్ల రూపంలోనే**



న్యూయార్క్: టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల వేతనం రికార్డు స్థాయిలో పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆయన ఏకంగా 96.5 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 800 కోట్లకు పైగా) వేతన ప్యాకేజీని అందుకున్నారు. గత దశాబ్ద కాలంలో ఆయన సీఈఓగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇదే అత్యధిక వేతనం కావడం విశేషం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో కంపెనీ సాధించిన అసాధారణ విజయాలకు గుర్తింపుగానే ఆయన జీతాన్ని భారీగా పెంచినట్లు తెలుస్తోంది. మైక్రోసాఫ్ట్ రెగ్యులేటరీ ఫైలింగ్ ప్రకారం, నాదెళ్ల వేతనంలో అధిక భాగం షేర్ల రూపంలోనే ఉంది. ఆయన ప్రాథమిక వేతనం 2.5 మిలియన్ డాలర్లు కాగా, మిగిలిన 90 శాతం కంపెనీ షేర్ల రూపంలో అందుకోనున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఆయన 79.1 మిలియన్ డాలర్ల వేతనం అందుకున్నారు. ప్రస్తుతం టెక్నాలజీ ప్రపంచంలో ఏఐ ఒక పెను మార్పునకు కారణమవుతోందని, ఈ కీలక సమయంలో సత్య నాదెళ్ల, ఆయన నాయకత్వ బృందం మైక్రోసాఫ్ట్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపారని కంపెనీ బోర్డు వాటాదారులకు తెలియజేసింది. సత్య నాదెళ్ల నాయకత్వంలో మైక్రోసాఫ్ట్ షేరు విలువ ఈ ఏడాదిలోనే దాదాపు 23 శాతం పెరిగింది. ముఖ్యంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ వంటి పోటీదారులను అధిగమిస్తూ కంపెనీకి చెందిన అజూర్ క్లౌడ్ కంప్యూటింగ్ వ్యాపారం నిలకడగా వృద్ధి చెందుతోంది. ఒకప్పుడు చిన్న స్టార్టప్‌గా ఉన్న ఓపెన్‌ఏఐలో ముందుచూపుతో పెట్టుబడులు పెట్టడం నాదెళ్లకు బాగా కలిసొచ్చింది. చాట్‌జీపీటీ సంచలనం సృష్టించడంతో మైక్రోసాఫ్ట్ ఆ సంస్థలో తన పెట్టుబడులను 10 బిలియన్ డాలర్లకు పైగా పెంచింది. ప్రస్తుతం ఆఫీస్ టూల్స్ నుంచి క్లౌడ్ సేవల వరకు దాదాపు అన్ని మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులలో ఓపెన్‌ఏఐ టెక్నాలజీని అనుసంధానించారు. సత్య నాదెళ్ల వ్యూహాత్మక నిర్ణయాల వల్లే మైక్రోసాఫ్ట్ క్లౌడ్, ఏఐ రంగాల్లో అగ్రస్థానానికి చేరింది. లింక్డ్‌ఇన్, గిట్‌హబ్, యాక్టివిజన్ బ్లిజార్డ్ వంటి కీలక సంస్థలను కొనుగోలు చేసి సాఫ్ట్‌వేర్, గేమింగ్, ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ రంగాల్లోనూ కంపెనీని విస్తరించారు. ఆయనతో పాటు చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ అమీ హుడ్ 29.5 మిలియన్ డాలర్లు, కమర్షియల్ బిజినెస్ హెడ్ జడ్సన్ ఆల్తాఫ్ 28.2 మిలియన్ డాలర్ల వేతనాలు అందుకున్నారు.

## త్వరలో భారత్‌కు మెహుల్ చోక్సీ

లండన్: పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలో పారిపోయిన వ్యాపారవేత్త, ఆర్థిక నేరగాడు మెహుల్ చోక్సీని భారత్‌ను తీసుకువచ్చేందుకు మార్గం సుగమమైంది. చోక్సీని భారత్‌కు అప్పగించే విషయంలో బెల్జియం కోర్టు బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, బెల్జియన్ చట్టాల ప్రకారం చోక్సీని భారత్‌కు అప్పగించడంలో ఎలాంటి అడ్డంకులు లేవని స్పష్టం చేసింది. బెల్జియంలోని ఆంట్వెర్ప్‌లోని ఒక కోర్టు తన తీర్పులో చోక్సీ నేరాలు భారత శిక్షాస్మృతి (%ఖాజ%)లోని సెక్షన్లు 120-%దీ%, 201, 409, 420, 477-ఏ కింద చట్టం ప్రకారం శిక్షార్హమైనవని తెలిపింది. చోక్సీపై మోసం, దుర్వినియోగం, ఫోర్జరీ అభియోగాలు బెల్జియన్ చట్టం ప్రకారం కూడా శిక్షార్హమైనవని కోర్టు స్పష్టం చేసింది. ఛోక్సీ బెల్జియం పౌరుడు కాదని గుర్తుచేసింది. నేరాలు 2016 డిసెంబర్ 31.. ఒకటి జనవరి 2019 మధ్య భారత్‌లో జరిగాయని.. బెల్జియన్ చట్టం ప్రకారం ప్రాసిక్యూషన్ కాలపరిమితికి లోబడి ఉందదని తీర్పు స్పష్టం చేసింది. అయితే, భారత్ ఆదేశాలకు తనను ఆంటిగ్వా నుంచి కిడ్నాప్ చేశారంటూ చోక్సీ చేసిన వాదలను కోర్టు తోసిపుచ్చింది. ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవంటూ కొట్టిపడేసింది. చోక్సీ అప్పగింత అనంతరం అతడిని ఉంచే జైలుకు సంబంధించి భారత ప్రభుత్వం అందించిన వివరాలను ఈ సందర్భంగా కోర్టు ప్రస్తావించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి తీసుకున్న దాదాపు రూ.13 వేల కోట్ల రుణాలను ఎగ్గొట్టిన చోక్సీ, మేనల్లుడు నీరవ్ మోదీ దేశం విడిచి పారిపోయారు. చోక్సీ ఆంటిగ్వా బార్బుడాకు పారిపోగా.. నీరవ్‌మోదీ లండన్‌లో ఉంటున్నాడు. ఇటీవల అంట్వర్ప్‌లోని కోర్టు చోక్సీని భారత్‌కు అప్పగించేందుకు ఆమోదం తెలిపింది. భారత్‌కు చోక్సీని అప్పగిస్తే ఆయనను ముంబయిలోని ఆర్థర్ రోడ్ జైలులోని బ్యారక్ నెంబర్ 12లో ఉంచుతామని అధికారులు కోర్టుకు హామీ ఇచ్చారు. బ్యారక్ దాదాపు 46 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటుందని.. రెండు సెల్‌లు, ప్రైవేట్ టాయిలెట్ సౌకర్యాలు ఉన్నాయని.. వైద్య సహాయం ఉంటుందని అధికారులు తెలిపారు.






# నారా రోహిత్.. 4 రోజుల పెళ్లి

టాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ నారా రోహిత్ ఇప్పుడు పెళ్లికి రెడీ అవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమ్ముడి కొడుకుగా బాణం సినిమాతో టాలీవుడ్ లోకి హీరోగా ఎంట్రీ ఇచ్చిన నారా రోహిత్, మొదటి సినిమాతోనే మంచి డీసెంట్ హిట్ ను అందుకుని అందరి దృష్టినీ ఆకర్షించారు. ఆ తర్వాత సోలో మూవీతో భారీ హిట్ ను అందుకున్న రోహిత్ తనకంటూ స్పెషల్ ఇమేజ్ ను క్రియేట్ చేసుకున్నారు. రిజల్ట్ తో సంబంధం లేకుండా ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని కోరుకుంటూ డిఫరెంట్ ప్రయోగాలు చేసే నారా రోహిత్ రీసెంట్ గా సుందరకాండ అనే మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి సక్సెస్ ను అందుకున్నారు. ప్రతినిధి2 సినిమాలో తనతో పాటూ కలిసి నటించిన శిరీషతో ప్రేమలో పడ్డ రోహిత్, తర్వాత ఇరు కుటుంబాలను ఒప్పించి తమ ప్రేమను పెళ్లి వరకు తీసుకెళ్లి, అందులో భాగంగానే నిశ్చితార్థం కూడా చేసుకున్నారు. నిశ్చితార్థం తర్వాత రోహిత్ తండ్రి చనిపోవడంతో పెళ్లి వాయిదా పడగా, ఇప్పుడు వారి పెళ్లి డేట్ ఫిక్స్ అయినట్టు తెలుస్తోంది. అక్టోబర్ 30న రోహిత్-శిరీషల పెళ్లి అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ మధ్య కాలంలో పెళ్లి అంటే ఒక రోజే చేస్తున్నారు కానీ తమ పెళ్లిని తమతో పాటూ అందరూ గుర్తు పెట్టుకునేలా ప్లాన్ చేస్తున్నారట రోహిత్. అందులో భాగంగానే ఐదు రోజుల ముందు నుంచే వరుసగా ఈవెంట్స్ ను ప్లాన్ చేశారని తెలుస్తోంది. అక్టోబర్ 25న తెల్లాపూర్ లోని మండువా కోర్ట్‌యార్డ్ లో హల్దీ వేడుకతో రోహిత్ పెళ్లి వేడుకలు మొదలవనున్నాయి. ఆ తర్వాత అక్టోబర్ 26న ఐటీసీ గ్రాండ్ కాకతీయలో పెళ్లి కొడుకు ఫంక్షన్ ను ప్లాన్ చేశారట. తర్వాత అక్టోబర్ 28న మండువా కోర్ట్‌యార్డ్‌లో మెహందీ ఈవెంట్ జరగనుంది. ఇక ఆఖరిగా అజీజ్ నగర్ లోని ది వెన్యూ లో అక్టోబర్ 30వ తేదీ రాత్రి 10.35 నిమిషాలకు ఈ ప్రేమ జంట పెళ్లితో ఒక్కటి కానున్నారు. ఈ వేడుకలకు ఇరుపక్షాల కుటుంబ సభ్యులతో పాటూ బంధుమిత్రులు, సెలబ్రిటీలు, గెస్టులు హాజరు కానున్నారు.

# టాలీవుడ్ వైపు రకుల్ చూపులు!

రకుల్ ప్రీత్ సింగ్ టాలీవుడ్ కి దూరమై నాలుగేళ్లు అవుతోంది. కొండపొలం తర్వాత అమ్మడు పూర్తిగా బాలీవుడ్ కే పరిమితమైంది. అక్కడ అవకాశాలతోనే నటిగా బిజీ అయింది. కానీ సక్సస్ లు మాత్రం చెంత చేరలేదు. అవకాశా లైతే ఓడిసి పట్టుకుంటుంది గానీ? విజయాలు మాత్రం ఎక్కడా కనిపించలేదు. నాలుగేళ్లలో ఎనిమిది ..తొమ్మిది హిందీ సినిమాలు చేసింది. వాటిలో సక్సస్ భూతద్దం పెట్టి వెతికినా ఎక్కడా కనిపించదు. అయినా అవకాశాలు మాత్రం ఎక్కడా తగ్గలేదు. ప్రస్తుతం లైనప్ లో రెండు..మూడు సినిమాలున్నాయి. వాటిపై ఎలాంటి బజ్ కూడా లేదు. మరి ఇలాంటి ఫేజ్ లో ఉన్న రకుల్ మళ్లీ టాలీవుడ్ ప్రయత్నాలు మొదలు పెట్టిందా? అంటే అవుననే తెలుస్తోంది. అమ్మడు గత పరిచయస్తులకు మళ్లీ టచ్ లో కి వెళ్తుందిట. పాత మేనేజర్ ని మళ్లీ రంగంలోకి దించి దర్శక, నిర్మాతలకు టచ్ లో ఉండే ప్రయత్నం చేస్తుందిట. అలాగే రామ్ చరణ్-ఉపాసన దంపతులకు రకుల్ మంచి స్నేహితురాలు అన్న సంగతి తెలిసిందే. అటువైపు నుంచి కూడా అమ్మడు చేయాల్సిన ప్రయత్నాలు చేస్తోందిట. మరి కంబ్యాక్ ఛాన్స్ ఎవరైనా ఇస్తారా? లేదా? అన్నది చూడాలి. వాస్తవానికి రకుల్ టాలీవుడ్ లో అవకాశాలు వస్తోన్న సమయంలోనే వదిలి బాలీవుడ్ కి వెళ్లింది.






## 14న ఓటీటీలోకి డ్యూడ్!

దీపావళి బరిలో టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర పలు సినిమాలు సందడి చేస్తున్నాయి. వాటిలో ప్రదీప్ రంగనాథన్ నటించిన 'డ్యూడ్' చిత్రం కూడా ఒకటి. ఈ సినిమా పూర్తి రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా యూత్‌ను ఈ మూవీ కట్టిపడేస్తుంది. ఇక ఈ సినిమాను దర్శకుడు కీర్తిశ్వరన్ తెరకెక్కించిన తీరుకు ప్రశంసలు కురుస్తున్నాయి. అయితే, బాక్సాఫీస్ దగ్గర సాలిడ్ వసూళ్లతో రన్ అవుతున్న ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ స్ట్రీమింగ్ డేట్‌పై సినీ సర్కిల్స్‌లో ఓ వార్త జోరుగా వినిపిస్తోంది. డ్యూడ్ చిత్ర ఓటీటీ స్ట్రీమింగ్ రైట్స్‌ను నెట్‌ఫ్లిక్స్ భారీ రేటుకు దక్కించుకుంది. దీంతో ఈ సినిమాను నవంబర్ 14న ఓటీటీ స్ట్రీమింగ్‌కు తీసుకొచ్చేందుకు నెట్‌ఫ్లిక్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ చేసేందుకు నెట్‌ఫ్లిక్స్ రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. మరి నిజంగానే నవంబర్ 14న డ్యూడ్ ఓటీటీ ఎంట్రీ ఇస్తాడా అనేది వేచి చూడాలి.



# మంచి గర్ల్ ఫ్రెండ్‌ను: రష్మిక

విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న రహస్యంగా నిశ్చితార్థం చేసుకున్నారు. కానీ ఈ విషయాన్ని కూడా అభిమానులతో పంచుకోలేదు. కానీ నిశ్చితార్థం తర్వాత విజయ్ దేవరకొండ పుట్టపర్తి సత్యసాయి మహా సమాధిని సందర్శించడానికి వెళ్ళినప్పుడు అక్కడి స్థానికులు ఆయనను గౌరవంగా ఆహ్వానించారు. ఆ సమయం లో కొన్ని ఫోటోలు బయటకు రాగా.. ఆయన చేతి వేలికి ఉన్న ఉంగరంతో నిశ్చితార్థ విషయం కాస్త నిజమయింది. అలాగే మొన్నామధ్య రష్మిక మందన్న షేర్ చేసిన కొన్ని ఫోటోల ద్వారా కూడా ఆమె చేతికి ఉన్న డైమండ్ ఉంగరం బయటపడింది. దీంతో వీళ్ళిద్దరూ నిశ్చితార్థం చేసుకున్నట్లు అటు అభిమానులే కాదు సినీ సెలబ్రిటీలలు కూడా నిర్ధారణకు వచ్చేశారు. ఇకపోతే ఈ జంట ఎప్పటికప్పుడు హింట్ ఇస్తున్నారే తప్ప తమ బంధాన్ని అధికారికంగా ప్రకటించలేదు. ఇదిలా ఉండగా తాజాగా రష్మిక నటించిన చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. నవంబర్ 7వ తేదీన విడుదల కాబోతున్న నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించి ప్రమోషనల్ కార్యక్రమాలను చేపట్టారు చిత్ర బృందం. అందులో భాగంగానే ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన రాహుల్ రవీంద్రన్, రష్మిక మందన్న లను రాహుల్ రవీంద్రన్ భార్య, ప్రముఖ సింగర్, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి ఇంటర్వ్యూ చేశారు. అందులో భాగంగానే రష్మికను మీరు సింగిలే కదా అని రాహుల్ అడగడంతో ఆమె ఇచ్చిన సమాధానం అందరికీ ఒక క్లారిటీ వచ్చేసింది. మీరు సింగిలే కదా అని రాహుల్ అడగగా.. మొదట సిగ్గు పడిపోయిన రష్మిక.. నవ్వుతూ నేను మంచి గర్ల్ ఫ్రెండ్ ని అంటూ చెప్పుకొచ్చింది. మొత్తానికైతే తాను సింగిల్ కాదని తాను కూడా రిలేషన్ లో ఉన్నానని ఈ విధంగా చెప్పేసింది రష్మిక.

## ఆర్టీ76 అప్‌డేట్.. ఇదిగో అంటున్న ఆషిక!

మాస్ రాజా రవితేజ నటిస్తున్న 'మాస్ జాతర' అక్టోబర్ 31న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయింది. ఈ సినిమాను భాను బోగవరపు డైరెక్ట్ చేస్తుండటంతో ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి విజయాన్ని అందుకుంటుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ క్రమంలో రవితేజ నెక్స్ట్ చిత్రం ఆర్టీ76పై హీరోయిన్ ఆషికా రంగనాథ్ ఓ సాలిడ్ అప్డేట్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ స్పెయిన్‌లో జరుగుతుందని.. అక్కడ ఓ సాంగ్ షూటింగ్ చేస్తున్నట్లు ఆమె కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇక ఈ పాట షూటింగ్‌తో స్పెయిన్ షెడ్యూల్ పూర్తవుతున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.






## మోస్ట్ వాంటెడ్ సైనికుడు..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తన అభిమానులకు పుట్టినరోజు కానుక ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం టైటిల్‌ను రేపు ప్రకటించనున్నట్లు చిత్రబృందం అధికారికంగా వెల్లడించింది. ఈ మేరకు ఓ ఆసక్తికరమైన పోస్టర్‌ను విడుదల చేసి అంచనాలను పెంచింది. ప్రస్తుతం 'రాజాసాబ్' చిత్రంతో బిజీగా ఉన్న ప్రభాస్, ఆ తర్వాత 'సీతారామం' ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వంలో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించి విడుదల చేసిన పోస్టర్‌లో సైనికుడి దుస్తుల్లో ఉన్న ప్రభాస్ కాళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. 'ఒక సైనికుడు ఒంటరిగా కవాతు చేస్తాడు', '1932 నుంచి మోస్ట్ వాంటెడ్' వంటి క్యాప్షన్లు సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచుతున్నాయి. ఈ సినిమా టైటిల్‌ను ప్రభాస్ పుట్టినరోజైన అక్టోబర్ 23న ఉదయం 11:07 గంటలకు వెల్లడించనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ సినిమా రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో సాగే ఒక పీరియాడిక్ ప్రేమకథగా ప్రచారం జరుగుతోంది. అయితే, తాజా పోస్టర్‌లోని క్యాప్షన్లను బట్టి ఇందులో స్పై థ్రిల్లర్ అంశాలు కూడా ఉండొచ్చని అభిమానులు అంచనా వేస్తున్నారు. దీంతో ప్రభాస్ పాత్రపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన కొత్త నటి ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు సమాచారం.



# గెలుపో ఓటమో..!



# చావో రేవో..!

**భారత క్రికెట్ చరిత్రలో గురువారం ఒక కీలకమైన రోజుగా నిలవనుంది. భారత పురుషుల, మహిళల జట్లు రెండూ ఒకే రోజున అత్యంత ముఖ్యమైన మ్యాచ్‌లలో తలపడనున్నాయి. ఒకరికి సిరీస్ పరువు, మరొకరికి ప్రపంచకప్ సెమీస్ బెర్తు పందెం. ఈ రెండు పోరాటాలు భారత క్రికెట్ అభిమానులకు ఉత్కంఠను, ఉద్వేగాన్ని అందివ్వనున్నాయి.**

మూడు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో ఓటమి పాలైన భారత పురుషుల జట్టుకు అడిలైడ్ వేదికగా జరిగే ఈ రెండవ వన్డే చావోరేవో లాంటిది. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే సిరీస్ ఆశలు సజీవంగా ఉంటాయి. ఈ పోరులో అందరి దృష్టి పడేది ఇద్దరు దిగ్గజాలపైనే %-% రోహిత్ శర్మ మరియు విరాట్ కోహ్లీ. తొలి వన్డేలో రోహిత్ 8 పరుగులకే, విరాట్ డకౌట్‌గా వెనుదిరగడంతో, వారిపై విమర్శకుల ఒత్తిడి పెరిగింది. యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ జట్టును నడిపిస్తున్నప్పటికీ, కష్టసమయాల్లో సీనియర్లు ఎలా రాణిస్తారనేది ఈ మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయిస్తుంది. జట్టు కూర్పులోనూ చర్చ నడుస్తోంది. రెండవ ఓపెనర్‌గా యశస్వి జైస్వాల్‌కు అవకాశం ఇస్తారా? లేదా? అలాగే, స్పిన్ బలాన్ని పెంచేందుకు కుల్‌దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకుంటే, మరొకరిని తప్పించాల్సి ఉంటుంది. మొత్తానికి, సిరీస్‌ను కోల్పోకుండా ఉండాలంటే, భారత్ ఆసీస్‌పై దూకుడుగా ఆడి తీరాలి.

పురుషుల మ్యాచ్ కంటే మహిళల జట్టు పోరు మరింత తీవ్రంగా ఉంది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియం వేదికగా న్యూజిలాండ్‌తో తలపడే ఈ మ్యాచ్, ప్రపంచకప్ సెమీఫైనల్ బెర్త్ కోసం జరిగే ఫైనల్ యుద్ధం లాంటిది. ఇప్పటికే దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్లు సెమీస్‌కు చేరుకోగా, మిగిలిన ఒక స్థానం కోసం భారత్, న్యూజిలాండ్ సమాన పాయింట్లతో పోటీపడుతున్నాయి. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత మహిళల జట్టుకు ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే, ఎలాంటి సందేహం లేకుండా సెమీస్ స్థానం ఖాయమవుతుంది. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ రద్దయినా, భారత్‌కే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఎందుకంటే, తర్వాతి మ్యాచ్‌లో బలహీనమైన బంగ్లాదేశ్‌ను ఓడించడం సులభం అవుతుంది. కివీస్‌కు చివరి మ్యాచ్ ఇంగ్లాండ్‌తో ఉండడం మనకు కలిసొచ్చే అంశం. ఎలాగైనా సరే, భారత మహిళలు నేరుగా సెమీస్‌లోకి దూసుకెళ్లేందుకు ఈ మ్యాచ్‌లో తమ సమష్టి బలాన్ని ప్రదర్శించాల్సి ఉంది.

## ఆసియాకప్..
# ఐసీసీతోనే లెక్కాపత్రం!

**నా చేతుల మీదుగానే ఇస్తా: నఖ్వీ**

**ఐసీసీ సమావేశంలో చర్చించాలని బీసీసీఐ నిర్ణయం**



2025 ఆసియా కప్ ట్రోఫీ అప్పగింత అంశంపై భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బీసీసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)తో చర్చించేందుకు బీసీసీఐ సిద్ధమైంది. ట్రోఫీ విషయంపై ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడు, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ మొండి వైఖరితో ఉండటంతో.. త్వరలో జరగనున్న ఐసీసీ సమావేశంలో ఈ విషయాన్ని లేవనెత్తాలని బోర్డు యోచిస్తున్నట్లు బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు ఓ జాతీయ మీడియాకు తెలిపారు. ఆసియా కప్ ట్రోఫీ అప్పగింతకు సంబంధించి మోహ్సిన్ నఖ్వీ చేసిన సూచనను బోర్డు అంగీకరించదు అని బీసీసీఐ ఉన్నతాధికారి చెప్పారు. డిసెంబర్ 4 నుంచి 7 వరకు దుబాయ్‌లో జరగనున్న ఐసీసీ బోర్డు సమావేశం ఈ అంశాన్ని చర్చించడానికి బీసీసీఐ సిద్ధమవుతోందని తెలిపారు. 'ట్రోఫీ దుబాయ్ ఏసీసీ కార్యాలయంలో ఉంది. ఏ బీసీసీఐ అధికారి లేదా భారత ఆటగాడు అక్కడికి వచ్చి ఏసీసీ చీఫ్ చేతుల మీదుగా ట్రోఫీని తీసుకోవచ్చు' అని బీసీసీఐ పంపిన హెచ్చరిక ఇ-మెయిల్‌కు నఖ్వీ బదులిచ్చారు. ఈ నేపథ్యంలో బీసీసీఐ స్పందించింది.

# బుమ్రా టాప్.. వన్డేల్లోకి సిరాజ్ రీఎంట్రీ

**ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మనోళ్ల జోరు**



ఐసీసీ తాజాగా విడుదల చేసిన టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అయితే, అతడికి పాకిస్థాన్ బౌలర్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. పాక్ స్పిన్నర్ నోమాన్ అలీ అద్భుత ప్రదర్శనతో రెండో స్థానానికి దూసుకురావడంతో బుమ్రా ఆధిక్యం కేవలం 29 పాయింట్లకు పడిపోయింది. దక్షిణాఫ్రికాతో లాహోర్‌లో జరిగిన టెస్టులో నోమాన్ అలీ 10 వికెట్ల ప్రదర్శనతో సత్తా చాటాడు. ఈ ప్రదర్శనతో అతను ఏకంగా నాలుగు స్థానాలు ఎగబాకి 853 రేటింగ్ పాయింట్లతో కెరీర్‌లోనే అత్యుత్తమ రెండో ర్యాంకును అందుకున్నాడు. ఇదే మ్యాచ్‌లో రాణించిన మరో పాక్ పేసర్ షాహీన్ అఫ్రిది మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 19వ ర్యాంకులో నిలిచాడు. టెస్ట్ బ్యాటింగ్ చార్టులో మాత్రం ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ తన అగ్రస్థానాన్ని కాపాడుకున్నాడు. మరోవైపు భారత ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ వన్డే ర్యాంకింగ్స్‌లోకి ఘనంగా పునరాగమనం చేశాడు. ఏడాది తర్వాత వన్డే ఆడిన సిరాజ్, ఆస్ట్రేలియాతో సిరీస్‌లో మంచి ప్రదర్శన కనబరిచి నేరుగా 17వ స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన మిచెల్ మార్ష్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 42వ స్థానానికి చేరాడు. ఆసీస్ బౌలర్లు జోష్ హేజిల్‌వుడ్ 10వ, మిచెల్ స్టార్క్ 21వ ర్యాంకు సాధించారు.



## కోహ్లీకి అచ్చొచ్చిన
# అడిలైడ్

ఆసీస్‌తో తొలి వన్డేలో డకౌట్‌తో తీవ్రంగా నిరాశపర్చిన విరాట్ కోహ్లీ.. మరో కీలక పోరుకు సిద్ధమయ్యాడు. అచ్చొచ్చిన మైదానంలో ప్రత్యర్థికి చుక్కలు చూపించేందుకు రెడీ అవుతున్నాడు. నాలుగున్నర నెలల సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చిన కోహ్లీ.. పెర్త్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్ డకౌటయ్యాడు. దాంతో ఈ మ్యాచ్‌లో టీమిండియా డక్ వర్త్ లూయిస్ పద్ధతిన 7 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. అడిలైడ్ వేదికగా గురువారం రెండో వన్డే జరగనుంది. ఈ సిరీస్‌లో నిలవాలంటే టీమిండియా ఈ మ్యాచ్ గెలవాలి. లేదంటే మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కోల్పోతుంది. అడిలైడ్ వన్డే గెలవాలంటే కోహ్లీతో పాటు రోహిత్ శర్మ రాణించాలి. అయితే అడిలైడ్‌లో కోహ్లీ రికార్డ్స్ బాగున్నాయి. అడిలైడ్ వేదికగా మూడు ఫార్మాట్లలో కలిపి 15 ఇన్నింగ్స్‌లు ఆడిన కోహ్లీ.. 65 సగటుతో 975 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలతో పాటు 4 శతకాలు ఉన్నాయి. ఇక్కడ ఇప్పటి వరకు 4 వన్డేలు ఆడిన కోహ్లీ 61 సగటుతో 244 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. దాంతో కోహ్లీ నుంచి మరో సెంచరీ వస్తుందని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. అడిలైడ్ వేదికగా అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కూడా కోహ్లీ కొనసాగుతున్నాడు. 975 పరుగులతో అతను టాప్ స్కోరర్‌గా నిలవగా.. సర్ డాన్ బ్రాడ్‌మన్ (970), స్టీవ్ స్మిత్(934), గ్రేగ్ చాపెల్(747), షేన్ వాట్సన్(729), ఆడమ్ గిల్‌క్రిస్ట్ (687) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. ఈ జాబితాలో బ్రాడ్‌మన్ మినహా మిగతా బ్యాటర్లంతా కోహ్లీ కంటే ఎక్కువ ఇన్నింగ్స్ ఆడారు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024-25లో భాగంగా అడిలైడ్ వేదికగా చివరిసారిగా ఆడిన కోహ్లీ.. ఈ డే/నైట్ టెస్ట్‌లో తీవ్రంగా నిరాశపర్చాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో 7, 11 పరుగులు మాత్రమే చేశాడు. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్న కోహ్లీ, రోహిత్‌లకు ఈ మ్యాచ్ అగ్ని పరీక్షగా మారింది. ఈ మ్యాచ్‌లో రాణిస్తేనే వారిపై ఒత్తిడి తగ్గనుంది. లేదంటే విమర్శలు రెట్టింపు అవుతాయి.



# నో హ్యాండ్‌షేక్

**ఏషియన్ యూత్ గేమ్స్‌లో భారత్ గెలుపు**

**81-26 తేడాతో చిత్తుగా ఓడిన పాకిస్థాన్**

**కరచాలనం చేసేందుకు నిరాకరించిన భారత జట్టు**

ఆసియా కప్ క్రికెట్, మహిళల ప్రపంచ కప్ తర్వాత మరో క్రీడా పోటీలోనూ భారత క్రీడాకారులు పాకిస్తాన్ జట్టుతో కరచాలనం చేయకుండా తమ వైఖరిని కొనసాగించారు. మూడవ ఏషియన్ యూత్ గేమ్స్‌లో భాగంగా జరిగిన కబడ్డీ మ్యాచ్‌లో భారత యువ జట్టు పాకిస్తాన్ టీమ్‌ను 81-26 తేడాతో చిత్తుగా ఓడించింది. మ్యాచ్ ప్రారంభానికి ముందు భారత కెప్టెన్ ఇషాంత్ రాఠీ పాకిస్తాన్ కెప్టెన్‌తో కరచాలనం చేయడానికి నిరాకరించారు. పాకిస్తాన్ కెప్టెన్ చేయి అందించినా, రాఠీ తిరస్కరించడం గమనార్హం. ఏషియన్ యూత్ గేమ్స్‌లో భారత కబడ్డీ జట్టు తమ ఆధిపత్యాన్ని స్పష్టంగా చూపించింది. పాకిస్తాన్‌ను ఓడించడానికి ముందు, ఈ జట్టు బంగ్లాదేశ్‌ను 83-19 తేడాతో, శ్రీలంకను 89-16 తేడాతో చిత్తు చేసింది. ఈ టోర్నమెంట్‌లో భారత యువ కబడ్డీ జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోంది. పహల్గామ్ ఉగ్రదాడి, దానికి భారత్ ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీని ప్రభావం క్రీడా రంగంపై కూడా పడింది. ఇటీవల జరిగిన ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ టాస్ సమయంలో పాకిస్తాన్ కెప్టెన్‌తో కరచాలనం చేయలేదు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా ఇరు జట్ల క్రీడాకారులు ఎవరూ ఒకరికొకరు చేతులు కలపలేదు. ఆసియా కప్‌లో ఫైనల్‌తో సహా రెండు జట్ల మధ్య మూడు మ్యాచ్‌లు జరిగాయి. ఈ మూడింటిలోనూ భారత జట్టు పాకిస్తాన్‌ను ఓడించింది. ఫైనల్‌లో పాకిస్తాన్‌ను ఓడించిన తర్వాత, భారత జట్టు ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు మొహ్సిన్ నక్వి చేతుల మీదుగా ట్రోఫీ, మెడల్స్ తీసుకోవడానికి నిరాకరించింది. సూర్యకుమార్ యాదవ్ ప్రారంభించిన ఈ 'నో-హ్యాండ్‌షేక్' ట్రెండ్‌ను భారత మహిళా జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మహిళల వన్డే ప్రపంచ కప్‌లో ముందుకు తీసుకెళ్లారు. పాకిస్తాన్‌తో జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో ఆమె టాస్ సందర్భంగా పాకిస్తాన్ కెప్టెన్‌తో కరచాలనం చేయలేదు. ఆ మ్యాచ్‌లో భారత జట్టు విజయం సాధించింది. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా ఇరు జట్లు చేతులు కలపలేదు. ఇప్పుడు సూర్యకుమార్ యాదవ్, హర్మన్‌ప్రీత్ కౌర్ బాటలో భారత యువ కబడ్డీ జట్టు కెప్టెన్ ఇషాంత్ రాఠీ కూడా నడిచారు.

# లెఫ్టినంట్ కల్నల్‌గా నీరజ్ చోప్రా

భారత మేటి జావెలిన్ త్రోయర్, ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం దక్కింది. జావెలిన్ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాకు భారతీయ ఆర్మీలో గౌరవప్రదమైన లెఫ్టినెంట్ కల్నల్ ర్యాంక్‌ను అందజేశారు. ఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లో ఆయన్ను ఆ ర్యాంక్‌తో సన్మానించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నీరజ్ చోప్రా కుటుంబం కూడా ఈ ఈవెంట్‌ను ప్రత్యక్షంగా వీక్షించింది. పట్టుదలకు, దేశభక్తికి నీరజ్ చోప్రా నిదర్శనమని రాజ్‌నాథ్ అన్నారు. ప్రభుత్వ గెజిట్ ప్రకారం నీరజ్ చోప్రా నియామకం ఏప్రిల్ 16వ తేదీన జరిగింది. జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్‌గా నయిబ్ సుబేదార్ ర్యాంకుతో నీరజ్ చోప్రా 2016 ఆగస్టులో భారతీయ సైన్యంలో చేరారు. నీరజ్ చోప్రాకు గతంలో పద్మశ్రీ, మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న , అర్జున అవార్డులు దక్కాయి. పరమ విశిష్ట సేవా మెడల్, విశిష్ట సేవా మెడల్ కూడా ఆయన గెలుచుకున్నారు. 2020లో టోక్యోలో జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా స్వర్ణ పతకం గెలుచుకుని చరిత్ర సృష్టించారు. ఆ తర్వాత 2024 పారిస్ ఒలింపిక్ క్రీడల్లో రజత పతకం సాధించాడు. 2023 వరల్డ్ అథ్లటిక్స్‌లో గోల్డ్ మెడల్ కొట్టాడు. ఏషియన్, కామన్‌వెల్త్ గేమ్స్‌తో పాటు డైమండ్ లీగ్‌ల్లోనూ అతను స్వర్ణ పతకాలు గెలుచుకున్నాడు. నీరజ్ చోప్రా తన జావెలిన్‌ను అత్యుత్తమంగా 90.23 మీటర్ల దూరం విసిరి రికార్డు సృష్టించాడు.



ఈవార్తలు ప్రజావాణి

సంపాదకీయం

నేటి ఈవార్తలు

గురువారం 23-10-2025 | www.evarthalu.com



విద్యారంగంలో అత్యంత ప్రధానమైన మూడు ప్రశ్నలు వున్నాయి. అవి ఏమి నేర్పించాలి? ఎందుకు నేర్పించాలి? ఎలా నేర్పించాలి? ఈ మూడు ప్రశ్నల పరిష్కారం పైనే విద్య ప్రయోజకత్వం ఆధారపడి వుంది. విద్యకు సంబంధించిన ఏ ప్రణాళికలోనైనా, ఏ పద్ధతిలోనైనా ఈ మూడు అంశాలు తప్పకుండా గమనింపబడాలి. ఈ మూడింటిని చర్చగా సమన్వయ పరచినపుడే ఫలితాలు మంచివిగా మనకు అందుతాయి.


# ఏం నేర్పించాలి.. ఎలా నేర్పించాలి?

ఏమి నేర్పించాలి? ఎందుకు నేర్పించాలి? ఈ రెండూ వ్యక్తి అవసరాలు, సమాజ అవసరాలు, దేశ అవసరాలపై ఆధారపడి వుంటాయి. ఈ అవసరాలు కూడా తాత్కాలికమైనవిగాను, శాశ్వతమైనవిగాను రెండు రకాలుగా వుంటాయి. అందువల్ల మనం నేర్పించదలచుకున్న దాని పద్ధతి మారుతూ వుంటుంది. ఈ కారణం చేతే విద్యా ప్రణాళిక కూడా ఎల్లప్పుడూ మారుతూనే వుంటుంది. అలాగే విద్య నియమని బంధనలు కూడా, పద్ధతులు కూడా, ఫలితాలు కూడా నిర్ధారించటానికి విద్యావేత్తలు, మేధావులు నిరంతరం ప్రయత్నిస్తూ వుంటారు.ఇలాంటి భావాలకు మొదట రూపకల్పన చేసినవారు 'గిజూబాయి'. నవంబర్ 15,1885 న జన్మించి తన జీవితాన్ని విద్యార్థులకు,ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా తన అనుభవాలను ఉపయోగించి భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని ఎన్నో అమూల్య సూచనలు, సలహాలతో భారతీయ విద్యావిధానంలో ఉపాధ్యాయుడు విద్యార్థులతో ఎలా ఉండాలనే విషయాల్ని తెలుపుతూ ప్రత్యేకంగా వసతిని ఏర్పాటు చేసి వాటిని అమలు చేసి ఆదర్శంగా నిలిచిన మహానుభావుడు గిజుబాయి.ఎన్నో సముచిత మార్గాలను ఉపాధ్యాయులకు సూచించి జూన్ 23,1939 న తనువు చాలించిన మహాజ్ఞాని గిజుబాయ్. సులభమైన భాషలో యధార్థ విద్యాపరిస్థితులను విశ్లేషించడంలో గిజూభాయి సాటి ఎవరూ లేరు. ఆయన ఉపాధ్యాయుల పరిమితులను, ఇబ్బందులను కూడా బాగా అర్థం చేసుకున్న వారు. ఉపాధ్యాయులను బంధించి వుంచిన ఈ వ్యవస్థ కూరత్వం కూడా ఆయనకు బాగా తెలుసు."స్కూలు అనే ఎడారిలో పిల్లలు పడే బాధలు" ఆయన చూడలేక పోయారు. వారి బాధల నివారణకే ఆయన విద్యారంగంలో కొత్త కొత్త ప్రయోగాలు ఆవిష్కరించారు.

పిల్లల వికాసాన్ని దగ్గరగా వుండి చూడడానికి, సూక్ష్మంగా ఆలోచించడానికి తాను అనుకున్న విద్యా విలువలు నిరూపించటానికి ఆయన భావనగర్లో ఒక ప్రయోగశాల రూపంలో 'దక్షిణామూర్తి బాలమందిరం' స్థాపించారు. పిల్లల అవసరాలు, పిల్లల అభిరుచులు, పిల్లల శక్తిసామర్థ్యాలు మున్నగువాటిని గమనంలో పుంచుకుని ఆయన అక్కడ అనేక ప్రయోగాలు చేశారు. తదనంతరం వాటినన్నింటి సారాన్ని 'నూతన శిక్షణ' రూపంలో గిజూభాయి మనకు అందించారు. క్రొత్త దృక్పథం, క్రొత్త చైతన్యం, క్రొత్త జాగృతికి చిహ్నమైన గిజుభయ్ జీవితం అందరికీ ఆదర్శం. పుట్టినప్పటి నుండి పిల్లలు తమ తల్లిదండ్రుల నుంచి, తమ కుటుంబం నుంచి వారు పడే కష్టాలు, పొందే వేదనలు, బాధలు, దుఃఖాలు ఇన్నీ అన్నీ కావు. పిల్లలు ఎలాంటి నేరగాళ్ళు కారు వారు అత్యంత అమాయకులు అయినప్పటికీ మనం మన అజ్ఞానంచేత, తెలివిలేని తనం చేత, మనకు సాధారణంగా వున్న బలహీనతల చేత, మన పిల్లలనే రాత్రింబవళ్ళు వేధిస్తూవుంటాము.మాటి మాటికీ అవమానిస్తూ, కొడుతూ, తిడుతూ వారి జీవితాన్ని నరకప్రాయం చేస్తూవుంటాము.

ఒక్కసారి ఆలోచిద్దాం... మన పిల్లలను మనము చీటికీ మాటికీ తిడుతున్నామా లేదా? కొడుతున్నామా లేదా? చెప్పిన మాట వినలేదని దండిస్తున్నామా లేదా? మరీ మనకు కోపము హెచ్చితే ఇంటి నుంచి వారిని తరిమిగొడుతున్నామా లేదా? వీటికి ఏమైనా హద్దూ పద్దూ ఉందా? సాధారణంగా మన ఇళ్ళల్లో పెద్దవాళ్ళమైన మన చేతులే పైన ఉంటాయి. కానీ పాపం పిల్లలు బిక్కు బిక్కుమని అమాయక చూపులతో ఇంటిలోని ఒక మూలలో ఒదిగి పడిఉంటారు.ఇలాంటి కుటుంబాలు కోకొల్లలు.ఇది నాటి కాలపు పరిస్థితి కానీ నేడు మార్పు జరిగింది. అప్పటి ఆలోచన విధానం పై ఆనాటి రచనలు కొనసాగాయి.

అలాంటి అసంఖ్యాకమైన పిల్లలను రక్షించడానికి అన్నట్లు ఆవిర్భవించిన గుజరాతీ మహెూపాధ్యాయుడు "గిజూభాయి బధేకా". గుజరాత్‌లో పిల్లల మనోహరమైన శిక్షణా సంస్థ స్థాపించి మాంటిసోరీ పద్ధతిలో నవీన బోధనకు శ్రీకారం చుట్టిన మహానుభావుడు గిజుబాయ్. తల్లిదండ్రులకు, నూతన ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా సుమారు 17 ఉత్తమ పుస్తకాలను రచించారు. వీటిలో బాల మనస్తత్వ శాస్త్రం, వారి పెంపకం, వారి శిక్షణ, ప్రేమపూర్వకంగా వాత్సల్యంతో నిండి ఎలా చేయాలో మనకు ప్రబోధించారు.



ఈ పుస్తకాలన్నింటినీ తెలుగు ప్రజలకు, ఉపాధ్యాయులకు అందడం కొరకు తర్జుమా చేసి 7 సంపుటాలుగా రూపొందించి 2010 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి పాఠశాలకు ఉపాద్యాయుల కొరకు పంపిణీ చేశారు.రాజల్ దేసర్ (రాజస్థాన్)లోని మాంటిసోరి బాల శిక్షణా సమితి హిందీలో ప్రచురించిన 17 భాగాల సంకలనంను పాఠకుల సౌలభ్యం కోసం వాటిని 7 సంపుటాలుగా ప్రచురించడం జరిగింది.

గిజూబాయి రచించిన పుస్తకాలలో తల్లితండ్రులకు, తల్లితండ్రుల ప్రశ్నలు, తల్లితండ్రులు కావడం కఠినం, తల్లితండ్రుల తల నొప్పి, ప్రాథమిక పాఠశాలలో భాషా శిక్షణ,ఉపాధ్యాయులు అయినప్పుడు శిక్షణ.. నా భావనలు, ప్రాథమిక పాఠశాలల్లో బోధనా పద్ధతులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలలో లేఖా వాడనం,మాంటిసోరి పద్ధతి - భాగం-1 ,మాంటిసోరి పద్ధతి - భాగం-2,ప్రాథమిక పాఠశాలల్లో చేతి వృత్తుల శిక్షణ - భాగం-1 ,ప్రాథమిక పాఠశాలల్లో చేతి వృత్తుల శిక్షణ - భాగం-2,కథా బోధనా పద్ధతి,ఆడుతూ.. పాడుతూ అనేవి ముఖ్యమైనవి. పుస్తకాలలో 'మాంటిసోరి పద్ధతి', 'పగటికల', 'కథా బోధనా పద్ధతి' అత్యంత విలక్షణమైనవి.విద్యారంగంలో ఈ మూడు పుస్తకాలు చాలా మౌలికమైనవని భావింపబడుతాయి. ఇవి గిజూభాయి విద్యారంగానికి ఇచ్చిన కానుకలుగా గుర్తించబడినది.

వీటిలో గిజూభాయి తన మేధస్సును, మనస్సును పూర్తిగా మేళవింపుచేసి రాయడం వల్ల వీటిని చదివిన వారు బాలల శిక్షణను పూర్తిగా అర్థం చేసుకొని వాటిలోని అర్థాన్ని గ్రహించగలిగే ఎన్నోఅంశాలు నిండివున్నాయి. ఇవి బాలల జీవితాలను లోతుగా అధ్యయనం చేయడానికి ఎంతగానో దోహదపడుతున్నాయి. ఈ పుస్తకాలు దేశములోని ఉపాధ్యాయులకు,తల్లిదండ్రులకు తమ బాలలకు సంబంధించిన పరిజ్ఞానాన్నీ, శిక్షణా పద్ధతులను సమగ్రంగా అందిస్తాయని, కనుక వీటిని చదివి ,ఆచరణలో పెట్టడం వల్ల తమ పిల్లలను మంచి పద్ధతిలో పెంచుతారని గిజూభాయి ఆశించారు.

మన దేశంలో "గిజూభాయి బధేకా" బాలల శిక్షణ కొరకు ఒక ఆందోళన ప్రారంభించారు. విద్య అంటే ఆయన దృష్టిలో ఎంతో విస్తృతమైన అర్థం కలిగి, దాన నిర్మాణం, రచన, వ్యవస్థ, సాధన, సంస్కారం మొదలగు ఎన్నో అర్థాలనిచ్చి వ్యక్తి వికాసం పెంపొందించుకుని, అలాగే ఒక వ్యక్తిత్వాన్ని రూపుదిద్దటానికి కూడా అతనిని ఎంతో సంస్కారవంతుడిగా మార్చాల్సి రావడం, అతడి వ్యక్తిత్వం అందంగా, తేజోవంతంగా, మారడమే విద్య అని భావించిన మేధావి గిజూభాయి బధేకా. ఇళ్ళల్లో తల్లి తన పిల్లవాడితో ఎక్కువ సమయం గడుపుతుంది. అందువల్ల ఆమే వాడికి అత్యంత సన్నిహితురాలు. తన బిడ్డను అర్థం చేసుకోవడానికి ఓర్పు, నేర్పు, శక్తి సామర్థ్యాలు తల్లిలోనే ఎక్కువగా వుంటాయి. స్వర్గీయ గిజూభాయి గారు కూడా తల్లి లాంటి సూక్ష్మ దృష్టితో, మమత నిండిన కళ్ళతో పిల్లలను చూచారు. వారి వ్యక్తిత్వాన్ని జాగ్రత్తగా వికసింపజేసే ప్రయత్నం చేశారు. గిజూభాయి రచనలన్నీ అన్ని దేశ భాషలలోనూ రావలసి వుంది. ఆ రచనలు మన దేశ బాలల శిక్షణకు దిశానిర్దేశం చేసేవి. విద్యకుసంబంధించిన సిద్ధాంతాలను, బోధనా పద్ధతులను అర్థం చేసుకోవాలంటే ఆ రచనలు చదవడం అత్యవసరం. ఇంత కాలం తర్వాత కూడా ఆ పుస్తకాలు ఇందువల్లే ఉపయోగకరంగానూ, సందర్భోచితంగాను వున్నాయి. ఎందుకంటే అవన్నీ ఒక అనుభవం నిండిన ఉపాధ్యాయుడి అనుభవాల నుంచి వెలువడ్డాయి. ఆ కాలం నాటి జాతీయ నేపథ్యంలో, మానవత్వ నేపథ్యంలో ఆ రచనలు చేయబడ్డాయి. కాబట్టి ఆమె జీవితాన్ని,వారి రచనలు చదివి విద్యార్థితో ఎలా మసలుకోవాలో తెలుసుకొని చిన్నారులను ప్రేమతో చూసుకొని వారిని ఉత్తములుగా తయారు చేస్తారని ఆశిద్దాం.



గడప రఘుపతిరావు
9963499282
raghupatiraog@gmail.com



# వీహెచ్‌పీ.. ధర్మ రక్షా అభియాన్

హిందూ సమాజం ఆధ్యాత్మికతను, సాంస్కృతికతను కాపాడడానికి విశ్వహిందూ పరిషత్ దేశ వ్యాప్తంగా మరో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. "ధర్మ రక్షా అభియాన్" పేరుతో దేశ వ్యాప్తంగా ఓ ప్రచారాన్ని ప్రారంభించనుంది. అక్టోబర్ 5 నుంచి నవంబర్ 5 వరకూ జరిగే ఈ కార్యక్రమంలో సుమారు 10 లక్షల హిందూ కుటుంబాలను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. వారణాసి ప్రాంతంలో జరిగే ఈ అభియాన్ లో అక్రమ మత మార్పిళ్లు, లవ్ జిహాద్, గోవధతో పాటు దేవాలయ భూముల ఆక్రమణల వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమం కింద 2 వేల కి పైగా గ్రామాలు, పట్టణాల్లో ప్రతి హిందూ కుటుంబానికి చేరి, అవగాహన కల్పిస్తారు. అలాగే హైందవ ధర్మ పరిరక్షణలో భాగంగా హిందువులందరూ ఐక్యంగా వుండాలని కూడా విజ్ఞప్తి చేస్తారు. వారణాసి విశ్వహిందూ పరిషత్ బాధ్యులు నితిన్ మాట్లాడుతూ హిందువుల్లో సంఘటనా శక్తిని పెంచడానికి, సమష్టి భావనను నింపడానికి దీనిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "మా విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు ప్రతి హిందూ కుటుంబాన్ని చేరుకుంటారు. హిందూ ఉనికికి వున్న ముప్పును, సమస్యలను చర్చిస్తారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించడానికి చేపట్టాల్సిన పనులను కూడా వివరిస్తాం. అందుకే హిందూ కుటుంబం స్వచ్ఛందంగా సహకరించాలని కోరుతున్నాం" అని తెలిపారు. అలాగే ఈ ప్రచారంలో భాగంగా స్వావలంబన, పారదర్శకతను ప్రోత్సహించాలని కూడా వీహెచ్‌పీ లక్ష్యంగా పెట్టుకుంది. హిందూ వ్యతిరేక శక్తులు విదేశీ సంస్థల ప్రోత్సాహంతో హిందువుల్లో ఎలా విభజన బీజాలు నాటుతాయో కూడా వివరిస్తారు. అలాగే సంస్కృతిని కాపాడటం, దేవాలయాల సంరక్షణ, స్వదేశీని ప్రోత్సహించడంపై కూడా హిందువుల్లో చైతన్యం తీసుకురానున్నారు.



అభిషేక్ కురుమ
భజరంగ్‌దళ్ విద్యానగర్ జిల్లా సంయోజక్

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGTIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.